దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

సురేష్ కమ్యూనికేషన్స్ CSC
పాన్ కార్డు, పాస్‌పోర్టు | ఎ.ఎన్.యం రిజిస్ట్రేషన్, & రెన్యూవల్
డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్స్ | రైల్వే టికెట్లు బస్ టిక్కెట్లు రిజర్వేషన్
మనీ ట్రాన్స్‌ఫర్, మనీ విత్‌డ్రా | బైక్, కారు, ఆటో, ఇన్సూరెన్స్,
ఆర్.టి.ఎ సర్వీసెస్ | ఆన్‌లైన్ జాబ్ & ఎగ్జామ్ అప్లికేషన్స్
జి.యన్.యం, జి.ఎస్సీ | లైఫ్ సర్టిఫికెట్లు
డోర్ నెం. 14-5-16, లేపాక్షి ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ - 03

విజయవాడ VIJAYAWADA	సంపుటి : 25	సంచిక : 130	ది. 23-8-2026	ఆదివారం	పేజీలు : 8	వెల : రూ.1/-
	Vol.No : 25	Issue No : 130	Date : 23-8-2026	Sunday	Pages : 8	Rs.1/-

పారిశ్రామిక కారిడార్‌గా ఉత్తరాంధ్ర

- పరిశ్రమలు, ఫార్మా కేంద్రాలు, పెట్టుబడులతో నాలెడ్జ్ ఎకానమీ
- డేటా సెంటర్లపై కొందరు తప్పుడు ప్రచారం
- ప్రారంభంకాకుండానే నీళ్లు ఇంకిపోతున్నాయని అపోహలు సృష్టి
- ప్రతిగ్రామం జీరో వేస్ట్ గ్రామంగా మారాలి
- మన ఊరు--మన బాధ్యతతో స్వచ్ఛాంధ్ర సాధిద్దాం
- గ్రూప్-1లో అక్రమాలతో ఏపీపీఎస్‌సీపై నమ్మకాన్ని దెబ్బతీశారు
- గత పాలకుల తప్పిదాలను సరిదిద్దేందుకే మూడేళ్ల సమయం
- అలమండ కోడూరు స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర సభలో సీఎం చంద్రబాబు

మాడుగుల, ఆగష్టు 22 (వార్తాప్రభ) : ఉత్తరాంధ్రను పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతామని... అనకాపల్లి జిల్లాను రాష్ట్రంలోనే నంబర్-1 జిల్లాగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అనకాపల్లి ఇక బెల్లానికి మాత్రమే ప్రసిద్ధి చెందిన ప్రాంతం కాదని, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, డేటా సెంటర్లు, ఫార్మా, అల్యూమినియం తదితర పరిశ్రమలకు కేంద్రంగా మారుతోందని చెప్పారు. అనకాపల్లిని అన్ని కంపెనీలకు కేంద్రంగా, నాలెడ్జ్ ఎకానమీకి చిరునామాగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అలమండ కోడూరులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ అలమండ కోడూరుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించిన గ్రీన్ అంబాసిడర్లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనకాపల్లి జిల్లా ఎన్డీఏకు కంచుకోటగా నిలిచిందని సీఎం చంద్రబాబు అన్నారు. గతంలో అనకాపల్లికి పెట్టుబడులు రాకపోవడంతో జిల్లా వెనుకబడిపోతుందని చాలామంది ఆందోళన చెందారని, ఇప్పుడు విశాఖకు మించి అనకాపల్లికి పెట్టుబడులు వచ్చే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ నిర్మాణం జరుగుతోందని, డేటా సెంటర్లు, ఫార్మా, అల్యూమినియం తదితర పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్రకు మణిహారంగా ఏఎస్ఆర్ విమానాశ్రయాన్ని ఇటీవల ప్రారంభించుకున్నామని సీఎం చెప్పారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు రెక్కలు తొడుగుతుందని అన్నారు. ఏఐ, డేటా సెంటర్ల గురించి చిన్నారులు సైతం మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. దేశంలో తొలిసారిగా క్వాంటం కంప్యూటింగ్‌ను రాష్ట్రానికి తీసుకురావడం గర్వకారణమని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు. 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ను నిర్మిస్తామని చెప్పారు. ఈ ప్రాంత యువతకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి సమన్వయంతో అనకాపల్లిని భవిష్యత్తులో రాష్ట్రంలోనే అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

డేటా సెంటర్లకు పోలవరం నీళ్లు.. డేటా సెంటర్లపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం విమర్శించారు. డేటా సెంటర్ నిర్మాణం ఇంకా ప్రారంభం కాకముందే నీళ్లు ఇంకిపోతాయని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఒక డేటా సెంటర్ ప్రారంభిస్తే ఐదు డేటా సెంటర్ల స్థాయికి ప్రాజెక్టులు వచ్చాయని, ఐదు గిగావాట్ల సామర్థ్యం ఇక్కడికి వస్తే లక్షలాది మంది ఏఐ ప్రొఫెషనల్స్ తయారయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. అన్ని డేటా సెంటర్లకు కలిపి 3.5 టీఎంసీల నీరు మాత్రమే అవసరమవుతుందని తెలిపారు. పోలవరం నుంచి వచ్చే నీటితో అనకాపల్లి జిల్లాలోని ప్రతి చెరువును నింపుతామని స్పష్టం చేశారు. వచ్చే నెల మొదటి వారంలో అనకాపల్లికి గోదావరి నీటిని తీసుకువస్తామని సీఎం ప్రకటించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే నెల మొదటివారంలో అనకాపల్లికి నీరు పారిస్తామని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ రిజర్వాయర్ పనులను రూ.29 కోట్లతో చేపడతామని, రైవాడ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. 30 ఏళ్ల క్రితం శ్రీకారం చుట్టిన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల31న ప్రారంభిస్తున్నామని సీఎం ప్రకటించారు. రెండేళ్లలో రాష్ట్రంలో రూ.2,250 కోట్లను అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేశామని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకుంటూ అభివృద్ధి.. అభివృద్ధి అంటే కేవలం పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలు రావడం మాత్రమే కాదని సీఎం అన్నారు. పరిశుభ్రమైన ప్రాంతాలు, స్వచ్ఛమైన పర్యావరణం కూడా అభివృద్ధిలో భాగమేనని చెప్పారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛత, సమాజహితం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇళ్లు, రోడ్లు, పరిసరాలు అన్నీ మనవే అన్న భావనతో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ధర్మ కోనేరు పునరుద్ధరణ చేపట్టడాన్ని అభినందించారు. పారిశుద్ధ్య కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలను సీఎం అభినందించారు. మన ఊరు--మన బాధ్యత సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇల్లు, వీధి, కార్యాలయం, పాఠశాల, మార్కెట్.. ప్రతి ప్రదేశం పరిశుభ్రంగా ఉన్నప్పుడే స్వచ్ఛమైన పర్యావరణం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి గ్రామాన్ని జీరో వేస్ట్ గ్రామంగా మార్చాలని, ఉత్పత్తి అయ్యే ప్రతి వ్యర్థాన్ని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో గత రెండేళ్లలో 143 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేశామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చెత్తను గుట్టలు గుట్టలుగా పోగేశారని, వర్షాల సమయంలో ఆ చెత్త వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యాయన్నారు. చెత్త నుంచి సంపద సృష్టిస్తామని చెప్పినప్పుడు ఆశ్చర్యంగా చూశారని, ఇప్పుడు చెత్త నుంచి గ్యాస్, ఎరువులు తయారు చేస్తున్నామని చెప్పారు. స్వచ్ఛ రథాల ద్వారా గ్రామాల్లో వ్యర్థాలను సేకరించి, వాటికి ప్రతిఫలంగా నిత్యావసర సరుకులు అందించే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతం పెంచేలా చర్యలు చేపట్టామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. స్వయం పేరుతో డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నామని సీఎం తెలిపారు.

వికసిత్ భారత్--2047 సాధన యువశక్తితోనే సాధ్యం - గోవా సీఎం ప్రమోద్ సావంత్

విజయవాడ పశ్చిమ,ఆగష్టు 22 (వార్తాప్రభ) : వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ అన్నారు. భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో శనివారం నిర్వహించిన 'వికసిత్ భారత్--2047 యువ రాజకీయ నాయకుల సంవాదం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ దేశంలో సుమారు 50 శాతం మంది యువత ఉన్నారని, వికసిత్ భారత్ లక్ష్యాన్ని యువశక్తితోనే సాధించగలమన్నారు. యువత రాజకీయాల్లోకి రావడంతో పాటు అనుభవం, స్థిరత్వానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భవిష్యత్తులో యువత వ్యాపారవేత్తలు, విధాన రూపకర్తలు, రాజకీయ నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశం కోసం పనిచేసే బాధ్యతాయుతమైన, పారదర్శకమైన నాయకత్వం యువతలో పెరగాలని అన్నారు. యువశక్తి, నారీశక్తి, కిసాన్ శక్తి, పేదల సంక్షేమం వికసిత్ భారత్‌కు నాలుగు ప్రధాన స్తంభాలని పేర్కొన్నారు. గతంలో దేశంలోని చాలామందికి బ్యాంకు ఖాతాలు లేని పరిస్థితి ఉండేదని, కేంద్ర ప్రభుత్వం జనధన్ ఖాతాల ద్వారా కోట్లాది మందిని ఆర్థిక వ్యవస్థలోకి తీసుకువచ్చిందన్నారు. దేశంలో ఐదో తరం అనుసంధానం అందుబాటులోకి వచ్చిందని, మౌలిక సదుపాయాల అభివృద్ధితో భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే దిశగా ముందుకు సాగుతోందన్నారు. యువతకు రాజకీయ పరిజ్ఞానం పెరగడంతో పాటు విధానాలను రూపొందించే సామర్థ్యం, ఫలితాలు సాధించే దృక్పథం ఉండాలని సూచించారు. విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలి ఎమ్మెల్యే సుజనా చౌదరి విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే, మాజీ కేంద్ర మంత్రి సుజనా చౌదరి మాట్లాడుతూ నేటి యువత ప్రతి అంశంలో ముందంజలో ఉంటోందన్నారు. కృత్రిమ మేధస్సుతో పాటు గ్రామీణ ప్రజల అనుభవం, మానవ మేధస్సు, రాజకీయ పరిజ్ఞానం కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ పరిజ్ఞానం, మానవ మేధస్సు, రాజకీయ అవగాహనతో యువత అద్భుతంగా రాణించగలదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 2047 నాటికి భారత్‌ను పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో రాజకీయ నాయకులుగా ఎదగాలని ఆలోచించాలని, దేశ ఆర్థిక అభివృద్ధిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. యువత ఆరోగ్యకరమైన జీవన విధానంపై దృష్టి పెట్టాలని, మాదక పదార్థాలు, అనారోగ్యకరమైన సంస్కృతులకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

స్వాతంత్ర్య సమరయోధుల కల సాకారం చేయాలి.. ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు యువత కృషి చేయాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు కన్న కలలను సాకారం చేసే దిశగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఇంటింటా నెట్‌జీరో... ఆదర్శ గ్రామాలే లక్ష్యం

- ఇంటి నుంచే పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం
- అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

మాడుగుల,ఆగష్టు 22 (వార్తాప్రభ) : పర్యావరణ పరిరక్షణను ఇంటింటి ఉద్యమంగా మార్చి... గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం నెట్‌జీరో గ్రామాల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. ఇంటి స్థాయి నుంచి కాలనీ, గ్రామ స్థాయి వరకు పర్యావరణహిత విధానాలను అమలు చేస్తూ.. క్రమంగా గ్రామాలను నెట్‌జీరో కమ్యూనిటీలుగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలవరం కోడూరులో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నెట్‌జీరో కార్యక్రమాలను పరిశీలించారు. నెట్‌జీరో గ్రామంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, సాధిస్తున్న లక్ష్యాలను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటింటా సౌర విద్యుత్ వినియోగం, పరిశుభ్రమైన వంట విధానాలు, తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ, మురుగునీటి నిర్వహణ వంటి చర్యల ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

వంటింటి వ్యర్థాలే సేంద్రియ ఎరువులు.. నెట్‌జీరో కార్యక్రమాలను అమలు చేస్తున్న జె. మహేశ్వరరావు నివాసాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. మహేశ్వరరావు, ఆయన సతీమణి ఇంట్లో చేపడుతున్న పర్యావరణహిత కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటి నుంచి వెలువడే తడి వ్యర్థాలను ప్రత్యేక కంపోస్టింగ్ గుంతల్లో వేస్తూ.. అక్కడికక్కడే సేంద్రియ ఎరువుగా మార్చుతున్న విధానాన్ని సీఎంకు చూపించారు. ఇలా ఇంట వండే తడి వ్యర్థాలను ఎరువుగా మార్చడం వల్ల ఎరువుల కొనుగోలు ఖర్చు తగ్గుదలతో పాటు వ్యర్థాల సేకరణ, రవాణా, నిర్వహణకు అయ్యే శ్రమ కూడా తగ్గుతుందని వివరించారు. వ్యర్థాన్ని సమస్యగా కాకుండా వనరుగా మార్చే ఈ విధానం గ్రామాల్లో విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మురుగునీటికి ఇంటి వద్దే పరిష్కారం.. ఇంటి నుంచి వెలువడే మురుగునీటిని రోడ్లపైకి వదలకుండా నిర్దేశిత గుంతల్లోకి మళ్లించే ఇన్‌సిటు వేస్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్ విధానాన్ని కూడా సీఎం పరిశీలించారు. దీంతో కాలనీ రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండకుండా చూడటంతో పాటు దోమలు, ఈగల వృద్ధిని నియంత్రించవచ్చని లబ్ధిదారు వివరించారు. ఈ విధానం ద్వారా నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పును తగ్గించడంతో పాటు కుటుంబాలకు, చుట్టుపక్కల ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు.

సంస్కరణలు పూర్తయ్యాయి... ఇక నూరుశాతం ఫలితాలే అందరి లక్ష్యం

- మారుతున్న చిన్నారుల ఆలోచనలకు అనుగుణంగా బోధనా పద్ధతులు మారాలి
- విజయనగరం జిల్లా క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్

విజయనగరం,ఆగష్టు 22 (వార్తాప్రభ) : ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను దేశంలో నెం.1గా తీర్చిదిద్దడమే నా లక్ష్యం, ఇందుకోసం ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులంతా కలసికట్టుగా పనిచేయాలని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. విజయ నగరం దాసన్నపేట జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి మంత్రి లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ... విద్యావ్యవస్థలో ప్రజాప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు పూర్తయ్యాయి, ఇక పూర్తిగా అభ్యసనా ఫలితాలపైనే ఉపాధ్యాయులంతా దృష్టిసారించాలి. ఇకపై నెలకోసారి క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్ పాల్గొని ఉపాధ్యాయుల క్షేత్రస్థాయి సమస్యలు తెలుసుకుంటా. సంస్కరణల కారణంగా గత ఏడాది అద్భుతమైన ఫలితాలు వచ్చాయి. ఇది తొలిమెట్టు మాత్రమే. నూరుశాతం ఫలితాల సాధనపై దృష్టిసారించాలి. ఇన్నొవేటివ్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఒత్తిడి లేని విధంగా మెళకువలు నేర్పాలి.

చందానగర్ పోలీస్ స్టేషన్ పై ఏసీబీ అధికారులు దాడులు

శేరిలింగంపల్లి,ఆగష్టు 22 (వార్తాప్రభ) : చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు శనివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించినట్లు సమాచారం. ఓ వ్యవహారంలో రూ.లక్ష లంచం తీసుకుంటున్న సమయంలో ఎస్సై బాలరాజును ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు తెలిసింది. అందిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్ని ఈ దాడులు నిర్వహించినట్లు సమాచారం. ఫిర్యాదుదారుడి నుంచి ఎస్సై బాలరాజు రూ.లక్ష స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ బృందం రంగంలోకి దిగి పట్టుకున్నట్లు తెలిసింది. లంచంగా తీసుకున్న నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కేసు వివరాలపై ఆరా లంచం ఎందుకు డిమాండ్ చేశారు? ఏ కేసు లేదా ఫిర్యాదుకు సంబంధించి నగదు తీసుకున్నారు? ఈ వ్యవహారంలో మరెవరైనా పోలీసు సిబ్బంది ప్రమేయం ఉందా? అనే అంశాలపై ఏసీబీ అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. పోలీస్‌స్టేషన్‌లోని సంబంధిత రికార్డులు, కేసు పత్రాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది ఎస్సై బాలరాజును అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు తదుపరి చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. ఘటనపై పూర్తి వివరాలు ఏసీబీ అధికారిక ప్రకటన అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం మేరకే ఈ వివరాలు వెల్లడవుతున్నాయి.

జోగి రమేష్ కుటుంబానికి ముందస్తు బెయిల్ మంజూరు

విజయవాడ లీగల్, ఆగష్టు 22 (వార్తాప్రభ) : జోగి రమేష్ సహా 11 మంది కుటుంబ సభ్యులకు ముందస్తు బెయిల్ మంజూరుచేస్తూ 5వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు శనివారం ఉత్తర్వులు జారీచేసింది. వివరాల్లోకి వెళితే.. జోగి రమేష్ సహా 11 మంది కుటుంబసభ్యులపై అదనపు వరకట్నం, చీటింగ్, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ ఆయన కోడలు మేఘన ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసిన విషయం విదితమే. ఈ కేసులో వారిని నిందితులుగా చేర్చుతూ పోలీసులు హత్యాయత్నం, గృహహింస, వరకట్న నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల క్రింద కేసు నమోదుచేశారు. దీనిపై తమను అరెస్టు నుండి రక్షణ కోరుతూ జోగి రమేష్ కుటుంబం తరపున సీనియర్ న్యాయవాదులు చోడిశెట్టి మన్మధరావు, ఆదాంకుమార్, ప్రాసిక్యూషన్ తరపున న్యాయవాది కిలారు బెనర్జీ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి వారందరికి బెయిల్ మంజూరుచేస్తూ తీర్పునిచ్చారు. రెండు వారాలలోపుగా ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో ఒక్కొక్కరు 25వేల పూచీకత్తుతోపాటు ఇద్దరు ష్యూరిటీలను సమర్పించాలని, విచారణాధికారికి అందుబాటులో ఉండాలన్నారు. ఈ కేసుకు సంబంధించిన వారిపై ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగా గానీ బెదిరింపులకు పాల్పడరాదని, అలాగే కోర్టు అనుమతి లేనిదే ఇండియా వదిలి వెళ్లరాదని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

కుప్పకూలిన అక్రమంగా నిర్మిస్తున్న ఏడంతస్తుల భవనం : ఇద్దరు మృతి

- దెబ్బతిన్న పక్క నిర్మాణాలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ, అధికారులు

శేరిలింగంపల్లి,ఆగష్టు 22 (వార్తాప్రభ) : కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ కాలనీలో నాలాను ఆనుకుని తక్కువ స్థలంలో అక్రమంగా ఏడు అంతస్తులతో నిర్మిస్తున్న భవనం శనివారం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పక్కనే ఉన్న కొన్ని నిర్మాణాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సంఘటన సమాచారం అందుకున్న వెంటనే సీహెచ్ఎంసీ కమిషనర్ సృజన, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, డీసీపీ రీతి రాజ్, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ వెంకన్నతో పాటు ఎన్‌డీఆర్ఎఫ్, హైడ్రా, టౌన్ ప్లానింగ్, సీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, అక్రమ నిర్మాణం కారణంగా చోటుచేసుకున్న ఈ ప్రమాదం అత్యంత దురదృష్టకరమని అన్నారు. నిర్లక్ష్యంగా నిర్మాణం చేపట్టిన యజమాని, బిల్డర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడంతో పాటు అనుమతుల పరిశీలనలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఆయన, ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సహాయక చర్యలను వేగవంతం చేసి బాధితులకు తక్షణ సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ తిరుపతమ్మ ఆలయం వద్ద డీ.జే. నిషేధించడం పై భక్తులు, గ్రామస్తుల ప్రశంసలు

పెనుగంచిప్రోలు,ఆగష్టు 22 (వార్తాప్రభ) : పెనుగంచిప్రోలు పట్టణమ-ందలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి ఆలయ పరిసరాలలోకి డీజే సౌండ్ సిస్టం ని ఈ.వో. లీలాకుమార్ నిషేధించడం పై ఆలయ ఈవో లీలా కుమార్ పై భక్తులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో విపరీతమైన సౌండ్ వలన భక్తులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు దృష్టికి తీసుకెళ్లడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆలయ ఈవో లీలా కుమార్ తెలిపారు.

గ్రామస్తుల వినతి.. అమ్మ వారి ఆలయ పరిసరాల ల్లో డీ జే సౌండ్ సిస్టం నిషేధం చేయడం ఎంతో సంతోష కర మైన విషయం అని, అలాగే గ్రామం లోని అన్ని రాజకీయ పక్షలు కలిసి పోలీస్ అధికారులను సంప్రదించి గ్రామం లో కూడ ఈ డీ జే సౌండ్ సిస్టం ను నిషేదించాలని లేకుంటే పిల్లలు, అనారోగ్యం తో ఉన్న ప్రతి ఒక్కరు తీవ్రంగా ఇబ్బందులు పడతారని గ్రామస్తులు వాపోతున్నారు.. ఇప్పటి కయినా గ్రామం ప్రశాంతగా వుండాలంటే గ్రామంలో కూడా డీ.జే. లను నిషేదించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆగస్టు 25 నుంచి నేత్రదాన ప్రచార పక్షోత్సవాలు

- సెప్టెంబర్ 8 వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు
- మరణానంతరం నేత్రదానానికి ముందుకు రావాలి: డాక్టర్ జి. సమరం

విజయవాడ,ఆగష్టు 22 (వార్తాప్రభ) : స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నేత్రదాన ప్రచార పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు ఐ బ్యాంక్ కార్యనిర్వాహక సంచాలకుడు డాక్టర్ జి. సమరం తెలిపారు. విజయవాడలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం, ఐ బ్యాంక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్‌ను స్థాపించి 31 సంవత్సరాలు పూర్తయ్యాయని, ఇప్పటివరకు నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్న 900 మందికి నేత్రదానం ద్వారా చూపు కల్పించినట్లు వెల్లడించారు. దేశంలో సుమారు 12 లక్షల మంది నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్నారని, ప్రతి సంవత్సరం కొత్తగా మరో 20 వేల నుంచి 30 వేల మంది ఈ సమస్య బారిన పడుతున్నారని పేర్కొన్నారు. మరణానంతరం నేత్రదానం చేస్తే నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపు ప్రసాదించవచ్చన్నారు. నేత్రదానంపై అవగాహన లేకపోవడం, అపోహలు, మూఢనమ్మకాల కారణంగా దాతలు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ కీర్తి మాట్లాడుతూ నేత్రదానంపై విస్తృత ప్రచారం జరగాలని, సమాజంలో నెలకొన్న అనుమానాలు, అపోహలు, మూఢనమ్మకాలను తొలగించాలని కోరారు. ఈ దిశగా స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ చేస్తున్న కృషికి నేత్రదాన పక్షోత్సవాలు మరింత దోహదపడతాయని చెప్పారు. వాసవ్య మహిళా మండలి కార్యదర్శి రశ్మి మాట్లాడుతూ ఆగస్టు 25న విజయవాడ నాస్తిక కేంద్రంలోని సమావేశ మందిరంలో పక్షోత్సవాల ప్రారంభ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య

అతిథిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా హాజరవుతారని చెప్పారు. ఆగస్టు 27న నేత్రదాన అవగాహన ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నామని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రావణ్‌బాబు దీనిని ప్రారంభిస్తారని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఆగస్టు 28న నేత్రదానం ప్రాముఖ్యతపై వ్యాసరచన, 29న చిత్రలేఖనం, 31న పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 1న ప్రశ్నోత్తరాల పోటీ, 5న నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్న వారిని గుర్తించి కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసేందుకు స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్‌లో పరీక్షా శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలన్నీ నాస్తిక కేంద్రంలో జరుగుతాయని, మరిన్ని వివరాలకు 9704020303 నంబరులో సంప్రదించాలని కోరారు. విలేకరుల సమావేశంలో నియంత, ఐ బ్యాంక్ మేనేజర్ డి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతికి గర్వదాయకులు మెగాస్టార్ చిరంజీవి

- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- కోడూరులో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు, మొక్కలు పంపిణీ

కోడూరు, ఆగష్టు 22 (వార్తాప్రభ) : మెగాస్టార్ చిరంజీవి ఉన్నత వ్యక్తిత్వంతో తెలుగుజాతికి గర్వదాయకులుగా నిలుస్తారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం కోడూరు ప్రధాన కూడలిలో కేంద్ర మాజీ మంత్రి, మెగాస్టార్ కొణిదెల చిరంజీవి పుట్టినరోజు వేడుకలు చిరంజీవి యువత మండల అధ్యక్షులు కోట రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చిరంజీవి పుట్టినరోజు వేడుకల కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఎమ్మెల్యే చేతులమీదుగా కోట రాంబాబు గ్రామస్థులకు 200 మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ విస్తృత సేవా కార్యక్రమాలతో విశేష ఖ్యాతి పొందిన చిరంజీవి తన లక్షలాది అభిమానులను సేవామార్గంలో నడిపి పేదలకు మేలు చేశారన్నారు. చిరంజీవి బ్లడ్ బ్యాంకు ద్వారా లక్షలాది మందికి రక్తదానం చేశారని, కరోనా సమయంలో రోగులకు కీలకమైన ఆక్సిజన్ అందించి ఆపద్బాంధవునిలా నిలిచారన్నారు. చిరంజీవి బాటలో పయనిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ అభినందనీయులు అన్నారు. పర్యావరణ హిత కార్యక్రమం నిర్వహించిన కోట రాంబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, అవనిగడ్డ, కోడూరు మండలాల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, మర్రె గంగయ్య, చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షులు సిద్ధినేని అశోక్ నాయుడు, టౌన్ అధ్యక్షులు అప్పికట్ల వినోద్, పిఎసిఎస్ చైర్మన్లు పూతబోయిన కరుణకుమార్, కోట సుబ్బారావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శులు కొండవీటి సునీత, గాజుల శంకరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, నీటి సంఘ అధ్యక్షులు బడే భావన్నారాయణ, చుండూరు నాగేశ్వరరావు, శివాజీ, రేపల్లె రవీంద్ర, ఏఎంసీ డైరెక్టర్లు జరుగు ఆదినారాయణ, మంగళగిరి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు, బడే గాంధీ, బచ్చు వెంకటేష్, తోట రాంబాబు, పూతబోయిన రత్నకుమార్, కడవకొల్లు శ్రీనివాసరావు, పరిసే వెంకటేశ్వరరావు, పెద్ది బాబూరావు, దేవనబోయిన కేశవ నారాయణ, సనకా జగన్, మల్లా వెంకటేశ్వరరావు, వర్రె రాంబాబు, చందు రామాంజనేయులు, కోట వేణుగోపాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాయ తోలుచు పురుగు అడుగుతో మామిడి రైతన్నల ఆశలకు చిల్లు

విస్సన్నపేట,ఆగష్టు 22 (వార్తాప్రభ) : స్థానిక మండలంలో కాయ తోలుచు పురుగు ఆక్రమణతో మామిడి రైతుల ఆశలకు చిల్లులు పడ్డాయని కొర్లమండ గ్రామ రైతు శ్రీనివాసరావు (ఎన్టీవీ ప్రసాద్) ఆవేదన వ్యక్తం చేశారు. పిల్ల పురుగు పిందే లేదా చిన్న కాయల తొడిమ వద్ద గుడ్లు పెడుతుందని తొలిసి లోపలికి వెళ్లి గుజ్జు మరియు జీడి గింజలు తింటూ పెరుగుతున్నాయని పురుగు ఆశించిన కాయల నుంచి జిగురు కారటం రాయల్ మామిడి కాయలు పసుపు రంగులోకి మారి అకాలంగా రాలిపోవడం జరుగుతోందని డబ్బు సంపాదన లక్ష్యంగా మార్కెట్ కు పంపకపోయిన కాలం కాని కాలంలో పదిమందికి వారు అబ్బురపడే విధంగా మామిడికాయ పంచాలన్నా ఆలోచనకు కూడా గండిపడిందని ఆయన చెప్పారు.

మానవతా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బాధిత కుటుంబాలు, రోగులకు రూ.10 వేల ఆర్థిక సహాయం

హనుమాన్ జంక్షన్, ఆగష్టు 22 (వార్తాప్రభ) : మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హనుమాన్ జంక్షన్ శాఖ కార్యాలయంలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రెండు కుటుంబాలకు సంస్థ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అప్పన్నవీడు పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తూ ఇటీవల మరణించిన ఎ.రాజు కుటుంబాన్ని మానవతా ప్రతినిధులు పరామర్శించారు. రాజు భార్య పవిత్ర ఇద్దరు చిన్నారులతో పాటు ప్రస్తుతం గర్భవతిగా ఉండటంతో వారి కుటుంబ పరిస్థితిని గుర్తించి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే అప్పన్నవీడుకు చెందిన తులిమెళ్ళి శ్రీను పక్షవాతంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న నేపథ్యంలో మందుల ఖర్చుల నిమిత్తం మరో రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. బాధితులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని మానవతా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అధ్యక్షురాలు ఇందిరాదేవి, కార్యదర్శి గణేష్, ట్రెజరర్ వెంకటస్వామి, ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, కన్వీనర్ సత్యనారాయణ, డైరెక్టర్లు రామచంద్రరావు, చలం, సుబ్బారావు, సుబ్బాచారి, కార్యవర్గ సభ్యులు శ్రీధర్, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మతి సాలె సాయి కృష్ణ కుటుంబాన్నీ పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసిన చైర్మన్ శ్రీనివాస్ గౌడ్

పెనుగంచిప్రోలు,ఆగష్టు 22 (వార్తాప్రభ) : తెలంగాణ రాష్ట్ర శీ లోని హుజూర్ నగర్ పురపాలక సంఘ కార్యాలయం లో సి.వో. గా విధులు నిర్వహిస్తూ గత 5రోజులు క్రితం మృతి చెందిన శ్రీ మతి సాలె సాయి కృష్ణ కుటుంబ సభ్యులు అయిన పెనుగంచిప్రోలు కు చెందిన ఆమె భర్త లక్షణన్, అత్త మామ లు పణితి జయరాజు, పుల్లమ్మ కుమార్తు భార్గవ్, కూతురు లావణ్య,, పేద నాన్న గేరా పాండవులు లను మసీదు పక్కన ఉన్న వారి గృహం నందు శనివారం పరామర్శించి, 2 లక్షలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని చైర్మన్ దొంత గాని శ్రీ నివాస్ గౌడ్ మరియు కార్యాలయం సిబ్బంది అంద చేశారు. హుజూర్ నగర్ పుర పాలక సంఘం చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ హుజూర్ నగర్ పురపాలక సంఘ కార్యాలయం మెప్మా విభాగం నందు సి.వో. గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన సాయి కృష్ణ కు ఘనంగా నివాళ్ళ అర్పించిమన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబమునకు గౌరవ పాలక వర్గం అన్ని వేళల సహాయ సహకారాలు అందిస్తుందని తెలియజేయుడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమములో వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, ఫోర్ లీడర్ మున్సిపాలిటీ కోతి సంపత్ రెడ్డి, కార్యాలయ మేనేజర్ ఎ.అశోక్ రెడ్డి , గౌరవ పాలకవర్గ కౌన్సిలర్లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మొక్కలు నాటిన ఆర్డీవో కె. కుమార్

తిరువూరు,ఆగష్టు 22 (వార్తాప్రభ) : తిరువూరు స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆర్డీవో కె. కుమార్, మున్సిపల్ కమిషనర్ కె. మనోజతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలిచారు. ఈ సందర్భంగా ఆర్డీవో కె. కుమార్ మాట్లాడుతూ, పరిశుభ్రమైన పరిసరాలతో పాటు పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటి, వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ కె. మనోజ మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నాటిన మొక్కలను సంరక్షిస్తూ అవి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.స్వచ్ఛత--పచ్చదనం సమన్వయంతో ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నిర్మించడమే స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జీపు ప్రచార జాతా కు తరలి వెళ్లిన పెనుగంచిప్రోలు కామ్రేడ్స్..

పెనుగంచిప్రోలు,ఆగష్టు 22 (వార్తాప్రభ) : జిల్లా లో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో సాగు, త్రాగు నీ రు ప్రాజేక్టు ల కోసం జీపు జాతా కార్యక్రమాని చేపట్ట డం జరిగింది శనివారం ఈ జీపు జాతా నందిగామ నుండి మాగల్లు, రామిరెడీ పల్లి, గుమ్మడి దుర్రు, అనిగండ్ల పాడు, ముచ్చిం తాల మీదుగా వత్స వాయి మండలం లోని పోచంపల్లి మున్నేరు ప్రాజెక్టు, వేదాద్రి, కంచల ఎత్తి పోతల పథకం పరిశీలన చేయు టకు ఈ జీపు జాతా వస్తుంది ఈ జీపు జాతా లో జాతీయ కమ్యూనిస్ట్ పార్టీ సభ్యులు అక్కినేని వనజ ఎన్ టీ ఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దో నేపుడి శంకర్ పాల్గొన్ననున్నారు కావున పెనుగంచిప్రోలు మండలం లోని సీపీఐ సీనియర్ నాయకులు వలంకొండ బ్రాహ్మం పొన్నం నరసింహారావు, చల్లాల శివాజీ (సిద్ధాంతి) శర్మ. పద్మాల వెంకటేశ్వర రావు ల ఆధ్వర్యంలో జీపు జాతా కీ రెండు కార్లలో తరలి వేళారు..

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె!

- హాస్టల్ విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటం.. ప్రమాదం జరిగే వరకు అధికారులకు మేలుకోరా?

తిరువూరు,ఆగష్టు 22 (వార్తాప్రభ) : ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణంలోని శాంతినగర్‌లో వాహిని కాలేజీ లేడీస్ హాస్టల్ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న దిమ్మె ప్రమాదకరంగా ఒరిగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉండటంతో హాస్టల్ విద్యార్థినులు, పాదచారులు, వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు మాత్రం ఈ ప్రమాదకర దిమ్మె కనిపించకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న దిమ్మె కూలిపోయి విద్యుత్ వైర్లు తెగిపడితే భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగాక స్పందిస్తారా? లేక ప్రమాదం జరగకముందే మేల్కొంటారా? అంటూ స్థానికులు విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా మహిళా హాస్టల్ సమీపంలోనే ఇలాంటి ప్రమాదకర పరిస్థితి ఉన్నా అధికారులు కనీస పర్యవేక్షణ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రాణనష్టం జరిగే వరకు అధికారులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు నిద్రలోనే ఉంటారా? అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత

అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని ప్రమాదకరంగా ఒరిగిన దిమ్మెను తొలగించి, ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షితంగా ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? ముందే హెచ్చరిస్తున్న ప్రజల మాటను అధికారులు పట్టించుకోకపోతే, రేపు జరిగే అనర్థానికి ఎవరు సమాధానం చెబుతారు? అని స్థానికులు నిలదీస్తున్నారు.

ముమ్మిడి కృష్ణ ఆధ్వర్యంలో గంగనాపల్లిలో టీడీపీలోకి చేరికలు

ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్

కాకినాడ,ఆగష్టు 22 (వార్తాప్రభ) : కాకినాడ రూరల్ నియోజకవర్గం గంగనాపల్లి గ్రామంలో ముమ్మిడి కృష్ణ ఆధ్వర్యంలో సుమారు 30 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సమక్షం లో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ నాయకులు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, కాకినాడ రూరల్ టీడీపీ ఇంచార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అన్నపూర్ణ'కు ఎస్ఐ సత్యం సురేష్ ప్రశంసలు

హనుమాన్ జంక్షన్,ఆగష్టు 22 (వార్తాప్రభ) : బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలోని వాణి విద్యా నికేతన్ కరస్పాండెంట్ నందిగం రవికుమార్ ఆధ్వర్యంలో వృద్ధుల కోసం 'అన్నపూర్ణ నిత్య అన్నదానం' పథకం పేరుతో నిర్వహిస్తున్న ఉచిత ఆహార పంపిణీ కార్యక్రమాన్ని వీరవల్లి ఎస్ఐ సత్యం సురేష్ శనివారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వృద్ధులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించిన ఎస్ఐ సత్యం సురేష్ మాట్లాడుతూ వైద్యులు సూచించిన ఆహార నియమాలను పాటిస్తూ వంటకాలను నాణ్యంగా, రుచికరంగా తయారు చేసి అందిస్తున్నారని అభినందించారు. వృద్ధుల ఆరోగ్యం, అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉచితంగా ఆహారం అందించడం అభినందనీయమన్నారు. సమాజంలో వృద్ధుల పట్ల బాధ్యతతో ఇలాంటి బృహత్తరమైన సామాజిక సేవా కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తున్న నందిగం రవికుమార్‌ను ఎస్ఐ సత్యం సురేష్ అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం నుండి మట్టి సేకరణ

మంత్రి లోకేష్ చేతుల మీదుగా మట్టినందుకు "సాగర తీర మహాగణపతి ఉత్సవ సేవ కమిటీ" సభ్యులు

మచిలీపట్నం,ఆగష్టు 22 (వార్తాప్రభ) : మచిలీపట్నం మంగినపూడి బీచ్ వద్ద ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న 63 అడుగుల మహాగణపతి నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసం నుండి మట్టి సేకరించారు. "సాగరతీర మహాగణపతి ఉత్సవ సేవా సమితి" సభ్యులు, కొల్లు పునీత్ చంద్ర లుమంత్రి నారా లోకేష్ ని కలిసి వారి చేతుల మీదుగా మట్టిని అందుకున్నారు.మంగినపూడి బీచ్‌ను భవిష్యత్తులో సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రం మొత్తం సుభిక్షంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా మట్టి సేకరిస్తున్నామని వివరించారు..

న్యూ ఎరా స్కూల్స్ ఫౌండర్ చైర్మన్ సాంబి రెడ్డి మృతికి వడ్డేపల్లి రాజేశ్వరరావు సంతాపం

కూకట్ పల్లి, ఆగస్ట్22(వార్తాప్రభ):న్యూ ఎరా స్కూల్స్ ఫౌండర్ చైర్మన్ సాంబి రెడ్డి స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేణుగోపాల్ రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న రాజేశ్వరరావు సాంబి రెడ్డి పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం న్యూ ఎరా స్కూల్స్ ప్రస్తుత చైర్మన్, స్వర్గీయ సాంబి రెడ్డి కుమారుడు వేణుగోపాల్ రెడ్డిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.విద్యారంగంలో న్యూ ఎరా స్కూల్స్ సంస్థను స్థాపించి ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన సాంబి రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఆయన మరణం విద్యారంగానికి, న్యూ ఎరా కుటుంబానికి, వారి కుటుంబ సభ్యులకు తీరని లోటని రాజేశ్వరరావు పేర్కొన్నారు.సాంబి రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ అపారమైన దుఃఖాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు భగవంతుని ప్రార్థించారు.

జీడిమెట్ల నుండి సూరారం రహదారిపై ఆక్రమణల తొలగింపు

సైబరాబాద్ మున్సిపల్, జోనల్ కమిషనర్ల ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు : గాజులరామారం డిప్యూటీ కమిషనర్ వెంకట్రాములు హెచ్చరిక

గాజులరామారం, ఆగస్టు 22, (వార్తాప్రభ) : సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ మరియు కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ పరిధిలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం శరవేగంగా జరిగింది. జీడిమెట్ల సబ్ స్టేషన్ నుండి సూరారం సిగ్నల్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న అక్రమ ఆక్రమణలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. నిత్యం వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే లక్ష్యంతో ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రహదారులను ఆక్రమించినా, అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని గాజులరామారం డిప్యూటీ కమిషనర్ యు. వెంకట్రాములు హెచ్చరించారు. రహదారులపై ఆక్రమణల వల్ల సాధారణ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆక్రమణలపై నిరంతరం చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) ఆర్. సుమిత్ర, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) బి. సరిత సేన్ తమ సిబ్బందితో కలిసి పాల్గొని పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. సులభతర ప్రయాణానికి సహకరించాలని, రహదారులను ఆక్రమించి వ్యాపారాలు లేదా నిర్మాణాలు చేయవద్దని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

అంజిబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన జర్నలిజం విద్యార్థులు.

కుత్బుల్లాపూర్, ఆగస్టు 22, (వార్తాప్రభ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి సురవరం ప్రతాప రెడ్డి తెలుగు యూనివర్సిటీలో సీనియర్ జర్నలిస్టు కళ్యాణ్ దాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంజిబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జర్నలిజం విద్యార్థిని, విద్యార్థులు అధ్యాపకులు శ్రేయోభిలాషులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈ వారంలో జన్మదినోత్సవాలు జరుపుకున్న మిత్రులు ప్రదీప్, చాకలి హరీష్, అంతర్జాతీయ ఫోటోగ్రఫీ డేని పురస్కరించుకొని ఫోటో జర్నలిస్టులు నవీన్, పవన్ కుమార్ లను కూడా అభినందించి సత్కరించారు. అలాగే ఇటీవల కూకట్పల్లి ప్రెస్ క్లబ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కూకట్పల్లి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నాగుల అంజిబాబుని కూడ ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ కళ్యాణ్ ఏర్పాటు చేసిన ఆత్మీయ విందుకు జర్నలిజం విద్యార్థులు హాజరై ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు మిత్రులు మ్యాకం రవికుమార్, జహంగీర్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది, కవి, రచయిత కొండూరి కోటిబాబు, విన్నపం ఒక పోరాటం వ్యవస్థాపక అధ్యక్షురాలు చీకూరి లీలావతి, ప్రాజెక్ట్ అకాడమీ డాక్టర్ పసుపులేటి హరీష్, జర్నలిజం విద్యార్థులు ఎస్ నరేష్, శివ, నదియా, నరసప్ప, రాచూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కావేటి ఇంటర్నేషనల్ లా ఫర్మ్ ఏఐ ఆధారిత అంతర్జాతీయ న్యాయ సేవలు

కావేటి ఇంటర్నేషనల్ లా ఫర్మ్ ప్రిన్సిపల్ ఉ ఫౌండర్ డా. శ్రీనివాస రావు కావేటి

24న బంజారా హిల్స్ లో కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్ : ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)"భారత్‌ను అంతర్జాతీయ న్యాయ సమాజంతో బలమైన వారధిగా అనుసంధానం చేయడం మా లక్ష్యం అని ప్రముఖ అంతర్జాతీయ న్యాయవాది కావేటి శ్రీనివాస్ అన్నారు. సరిహద్దులు దాటి న్యాయ వ్యవహారాల్లో మార్గదర్శకత్వం అవసరమైన వ్యక్తులు, వ్యాపార సంస్థలకు అంతర్జాతీయ న్యాయవాదులు, సొలిసిటర్లు, బ్యారిస్టర్లు, అడ్వకేట్ల సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నామన్నారు. మా ఏఐ కార్యక్రమం న్యాయ అవగాహనను పెంపొందించి, సమాచారానికి ప్రాప్యతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఉందని, అదే సమయంలో అత్యున్నత వృత్తిపరమైన న్యాయ ప్రమాణాలను కొనసాగిస్తామన్నారు. కావేటి ఇంటర్నేషనల్ లా ఫర్మ్ హైదరాబాద్‌లో తన నూతన కార్యాలయాన్ని ప్రారంభించనుందని వెల్లడించారు.బంజారా హిల్స్‌లోని ప్రెసిడెంట్ బంజారా హిల్స్, ఫ్లాట్ నంబర్ జ3, రోడ్ నంబర్ 2, ముగ్ధ సిల్క్స్ పక్కన ఉన్న కార్యాలయం ఈనెల 24 న ఉదయం 11:30 గంటలకు తెలంగాణ ప్రభుత్వ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు.

అంతర్జాతీయ న్యాయ సేవలకు కొత్త వేదిక హైదరాబాద్ కార్యాలయాన్ని అంతర్జాతీయ న్యాయ సేవలు, సరిహద్దులు దాటి న్యాయ సలహాలు, ఏఐ ఆధారిత న్యాయ అవగాహన, వృత్తిపరమైన సహకారానికి కేంద్రంగా అభివృద్ధి చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.భారత్‌లోని క్లయింట్లను వివిధ దేశాలకు చెందిన అనుభవజ్ఞులైన అంతర్జాతీయ న్యాయవాదులు, సొలిసిటర్లు, బ్యారిస్టర్లు, అటార్నీలు, అడ్వకేట్లతో అనుసంధానం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

ఏఐతో న్యాయ అవగాహనహైదరాబాద్ కార్యాలయ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఆధునిక న్యాయ విధానాలతో బాధ్యతాయుతంగా అనుసంధానం చేయడం కీలక అంశంగా ఉంటుందని సంస్థ తెలిపింది. న్యాయ పరిశోధన, సమాచారాన్ని సులభంగా పొందడం, ప్రాథమిక న్యాయ అవగాహన కల్పించడం, క్లిష్టమైన న్యాయ అంశాలను అర్థం చేసుకోవడంలో ఏఐ, ఆధునిక లీగల్ టెక్నాలజీలను సహాయక సాధనాలుగా వినియోగించనున్నట్లు పేర్కొంది. వృత్తిపరమైన న్యాయ సలహాలు, న్యాయ ప్రాతినిధ్యం మాత్రం సంబంధిత చట్టాలు, వృత్తిపరమైన ప్రమాణాలకు అనుగుణంగా అర్హత కలిగిన న్యాయ నిపుణుల ద్వారానే అందించబడతాయని సంస్థ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ, బహుళ విభాగాల న్యాయ నిపుణుల నెట్‌వర్క్ మద్దతుగా ఉంది. ఇందులో కావేటి ఇంటర్నేషనల్ లా ఫర్మ్ ప్రిన్సిపల్ ఉ ఫౌండర్ డా. శ్రీనివాస రావు కావేటి, కెనడాకు చెందిన అజ్మేరా లా ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ ఉ ఫౌండర్ డా. ప్రశాంత్ అజ్మేరా, అమెరికాకు చెందిన ఎడ్వర్డ్ ఓసీ, రామ్‌సేయర్ అవుకు, పార్థ్ సింగ్, యూకేకు చెందిన అడ్వకేట్ అనుప్రియా చావ్లా, అలాగే భారత్‌కు చెందిన పలువురు హైకోర్టు న్యాయవాదులు, అంతర్జాతీయ న్యాయ సలహాదారులు ఉన్నారు.

భారత్--అంతర్జాతీయ న్యాయ సమాజానికి వారధి బంజారా హిల్స్‌లోని కొత్త కార్యాలయం కేవలం సాధారణ న్యాయ కార్యాలయంగా కాకుండా, న్యాయ అవగాహన, అంతర్జాతీయ సహకారం, సరిహద్దులు దాటి న్యాయ నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఒక వేదికగా పనిచేయాలని సంస్థ భావిస్తోంది.బహుళ దేశాలకు సంబంధించిన న్యాయ వ్యవహారాలు, అంతర్జాతీయ లావాదేవీలు, ఇమ్మిగ్రేషన్, పెట్టుబడులు, కార్పొరేట్ వ్యవహారాలు, వివాదాలపై న్యాయ మార్గదర్శకత్వం అవసరమైన వారికి అంతర్జాతీయ న్యాయ నెట్‌వర్క్ ద్వారా సహాయం అందించడమే లక్ష్యమని సంస్థ తెలిపింది.

జీడిమెట్ల సర్కిల్ కార్యాలయంలో బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం

- **దోషరహిత, పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు అధికారుల ఆదేశం**
- **ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో నోటీసుల జారీ, అభ్యంతరాల పరిష్కారంపై అవగాహన**

జీడిమెట్ల, ఆగస్టు 22, (వార్తాప్రభ) : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ - 2026) కార్యక్రమంలో భాగంగా జీడిమెట్ల సర్కిల్-55 పరిధిలోని బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలకు) జీడిమెట్ల సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. నోటీసులు, క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కార దశపై ఈ శిక్షణ సాగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్-2002 మ్యాపింగ్ లేని ఓటర్లు, అలాగే రికార్డుల్లో వివరాల లోపాలున్న ఓటర్లకు (లాజికల్ డిస్క్రిపన్సీస్) క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసే విధానంపై బీఎల్ఓలకు అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల నుంచి అందే క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా పరిష్కరిస్తూ ఎలాంటి తప్పులు లేని దోషరహిత ఓటర్ల జాబితాను తయారు చేయాలని బీఎల్ఓలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మరియు ఏఈఆర్ఓ డి. శంకర్ సింగ్, ఏఈఆర్ఓలు పి. ఉదయ్ కుమార్, సునీత, ఆర్. గిరిబాబు, ఎలక్షన్ సూపరింటెండెంట్, బీఎల్ఓ సూపర్‌వైజర్లు మరియు బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కాలువలోకి బోల్తా కొట్టిన శ్రీ చైతన్య స్కూల్ బస్సు

- **ప్రమాద సమయంలో బస్సులో 20 మంది విద్యార్థులు,7 గురు సిబ్బంది**
- **ముగ్గురికి స్వల్ప గాయాలు**
- **అతివేగమే కారణం అంటున్న ప్రత్యక్ష సాక్షులు**
- **నిన్న గురుకుల్ నేడు శ్రీ చైతన్య పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న స్కూల్ బస్సులు**

జి.కొండూరు (ఇబ్రహీంపట్నం), ఆగస్టు 22 (వార్తా ప్రభ ప్రతినిధి): జి.కొండూరు మండల పరిధిలోని కట్టుబడిపాలెం - కవులూరు రహదారిపై తారకరామ కాలువలో శనివారం సాయంత్రం శ్రీ చైతన్య స్కూల్ బస్సు బోల్తా పడింది. అదృష్టవశాత్తు బస్సులో ఉన్న విద్యార్థులంతా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. సేకరించిన సమాచారం ప్రకారం ఇబ్రహీంపట్నం శ్రీ చైతన్య స్కూల్ బస్సు శనివారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత విద్యార్థులను ఎక్కించుకుని కట్టుబడిపాలెం వెళ్లింది. అక్కడ ఆ గ్రామానికి చెందిన విద్యార్థులను దింపేసి మిగిలిన విద్యార్థులతో కవులూరు బయలుదేరింది. మార్గమధ్యలో తారకరామ ఎత్తిపోతల పథకం కాలువ వద్ద అదుపు తప్పి కాలువలోకి బోల్తా పడింది. వేగంగా లారీని క్రాస్ చేయబోయి ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తు విద్యార్థులు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది విద్యార్థులు, 7 గురు సిబ్బంది ఉన్నట్లు సమాచారం. బస్సు బోల్తా పడటంతో విద్యార్థులు హాహాకారాలు చేశారు. రహదారిపై ప్రయాణిస్తున్న వారు, సమీపంలోని రైతులు, కూలీలు స్థానికులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని బస్సులో ఉన్న విద్యార్థులను బయటకు తీశారు. ఇందులో ముగ్గురు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి జి.కొండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. రవాణా శాఖ అధికారులు బస్సుల ఫిట్ నెస్ ను తనిఖీలు చేయడం లేదని తెలుస్తోంది. దీంతో పాఠశాల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా ఫిట్ నెస్ లేని బస్సులు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కొద్దిరోజుల క్రితం కేతనకొండ శ్రీ స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల బస్సు జూపూడి వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడింది. అదృష్టవశాత్తు అందులో పిల్లలు ప్రాణాలతో బయటపడ్డారు. అలాగే నల్లకుంట వద్ద శ్రీ చైతన్య స్కూల్ బస్సు ఆటోను ఢీకొట్టడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఇదే శ్రీ చైతన్య స్కూల్ బస్సు తారకరామ ఎత్తిపోతల పథకం కాలువలో బోల్తా పడింది. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు స్పందించి ఫిట్ నెస్ లేని బస్సులు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వెస్ట్ జోన్ ఏసిపి ఎన్ దుర్గారావు

ములపాడులో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22(వార్తా ప్రభ ప్రతినిధి): టెక్నాలజీ పెరగడంతో సైబర్ నేరాలు పెరిగాయని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు విజయవాడ వెస్ట్ జోన్ ఏసిపి ఎన్ దుర్గారావు. శనివారం మండల పరిధిలోని మూలపాడు గ్రామంలో గ్రామస్తులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ ప్రస్తుతం టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందిందని దానిని అదనుగా చేసుకొని నేరస్తులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్ట్, బ్యాంక్ ఓటిపి, అంటూ పరిచయం లేని వ్యక్తులు వివరాలు తెలపరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, సెక్టార్ ఎస్సై రాజు, గ్రామస్తులు గరికపాటి శ్రీను, గరికపాటి శివ పాల్గొన్నారు.

గ్రేస్ డాగ్ తో ఆకస్మిక తనిఖీలు

నిషేధిత గంజాయి మాదకద్రవ్యాలు రవాణా చేసిన విక్రయించిన సేవించిన కఠిన చర్యలు ఎస్ ఐ కేతారపు కళ్యాణి

భద్రాద్రి కొత్తగూడెం ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) సుజాతనగర్భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశానుసారం సుజాతనగర్ ఎస్ ఐ, కేతారపు, కళ్యాణి ఆధ్వర్యంలో మండలంలోని పలు కాలేజీలు పాఠశాలలుకిరాణా షాపులలో నార్కోటిక్ గ్రేస్ డాగ్ తో మెరుపు దాడి నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిషేధిత గంజాయి మాదకద్రవ్యాలు రవాణా చేసిన విక్రయించిన సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు మాదకద్రవ్యాలు ప్రాణాలను కుటుంబాలను నాశనం చేస్తాయని వీటికి దూరంగా ఉండటమే శ్రేయస్సు అని ముఖ్యంగా విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థి దిశ అనేది జీవితానికి ఎంతో కీలకమైనదని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలని ఆమె సూచించారు మాదకద్రవ్యాలు డ్రగ్స్ లాంటి గంజాయి లాంటి పదార్థాలు నేడు పల్లెల్లోకి చేరుకున్నాయని అన్నారు రాబోయే రోజుల్లో మాదకద్రవ్యాలను నిర్మూలించేది నేటితరం విద్యార్థులే అని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కొదురుపాక, రాఘువులు సిబ్బంది పాల్గొన్నారు

సుభాష్ నగర్ స్టీల్ బ్రిడ్జి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

పనుల పురోగతిని పరిశీలించిన ఆకుల సతీష్ బృందం

సత్తనడకన పనులతో నిత్యం నరకయాతన అనుభవిస్తున్న ప్రయాణికులు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 22, (వార్తాప్రభ) : సుభాష్ నగర్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిని ఆకుల సతీష్ ఆధ్వర్యంలోని బృందం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించింది. గత ఎనిమిది నెలలుగా ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు సత్తనడకన సాగుతుండటంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్ గ్రామం, అయోధ్య నగర్ చౌరస్తా నుండి సుచిత్ర వరకు ప్రతిరోజూ భారీగా ట్రాఫిక్ నిలిచిపోతుండటంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఆఫీసులకు, పాఠశాలలకు వెళ్లే సమయాల్లో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందన్నారు. స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులకు గణనీయమైన పరిష్కారం లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బ్రిడ్జి ప్లానింగ్‌లో అధికారులు పలుమార్లు మార్పులు చేయడం వల్లే నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారని నాయకులు తెలిపారు. అభివృద్ధి పనుల్లో రాజకీయ కారణాలతో జాప్యం జరిగితే చివరికి నష్టపోయేది సామాన్య ప్రజలేనని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జోనల్ కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సౌకర్యమే లక్ష్యంగా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. నిర్ణీత గడువులోగా బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆకుల సతీష్, నల్లా జయశంకర్ గౌడ్, పులి బలరాం, కంది శ్రీరాములు, హనుమాన్ జీ మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించిన మాజీ మేయర్ జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు శాంతి కోటేశ్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్

జవహర్ నగర్, ఆగస్టు 22(వార్తా ప్రభ): కీసర సర్కిల్‌జవహర్ నగర్ డివిజన్ గాంధీనగర్ అంబేద్కర్ నగర్ లో 22లక్షల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు మాజీ మేయర్ దొంతగాని శాంతి కొటేషగౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రధానకార్యదర్శి కల్లేపల్లి సదానందు జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు మాట్లా వినయ్, నాయకం భాస్కర్, గాజ్వెల్ శంకర్, వెంకటేశ్వర్లు, మాట్లా శ్రీను, రఫిక్, శ్రీమాన్, రమేశచారీ, వీరభాస్కర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మూడో వంతు త్యాగాలేనా ?... కూటమిలోని కొత్త నిష్పత్తి ?

స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయి. దాంతో తమకు పదవులు దక్కుతాయి అని కార్యకర్తలు నాయకులు గ్రౌండ్ లెవెల్ లో సంబర పడుతున్నారు. అదే సమయంలో ఎక్కడ ఎవరికి సీట్లు వస్తాయో అన్న బెంగ కూడా కూటమి పార్టీ కార్యకర్తలలో ఉంది. తాము ముందుగా ప్రచారం చేసుకున్నా చివరి నిముషంలో తప్పుకోవాల్సి వస్తుందేమో అన్న భయాలు కూడా ఉన్నాయి అంటున్నారు. దానికి కారణం పొత్తులు కొలిక్కి రావాల్సి ఉండడమే. ఎవరికి ఎక్కడ ఏ మోతాదుతో ఏ నిష్పత్తిలో సీట్లు ఇస్తారో తేలిపోతే మొదటి విజయం సాధించినట్లే అన్నది కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తల మాట. ఇక జనసేన అయితే తగ్గేది లేదు అని అంటోంది. ఈసారి లెక్క వేరు అని కూడా బిగ్ సౌండ్ చేస్తోంది. 2024 ఫార్ములాని మరచి పోవాల్సిందే అని కూడా అంటోంది. 2026 లో స్థానిక పోరులో లెక్కలు మారిపోతాయని కూడా బల్ల గుద్దుతోంది. దాంతోనే ఏ పార్టీకి ఎన్ని సీట్లు ఇస్తారో అన్నది మాత్రం తేలడం లేదు, నిజానికి సీట్ల సర్దుబాటు గురించి ప్రాథమికంగా సమావేశం కూడా కూటమి పార్టీల అధినేతల మధ్య జరగలేదు. కానీ ఈ మధ్యన ఒక నిష్పత్తి అయితే బయటకు వచ్చింది టీడీపీకి 80 శాతం జనసేనకు 15 శాతం బీజేపీకి అయిదు శాతం సీట్ల నిష్పత్తిలో పంపకాలు ఉంటాయన్నదే ఆ సారాంశం. దాంతో జనసేన తీవ్రంగా విభేదించింది. ఇక బీజేపీ శిబిరంలో కూడా ఎక్కువ సీట్లు కోరాలని డిమాండ్ ఉందని అంటున్నారు. ఈ క్రమంలో తాజాగా ఒక కొత్త ఫార్ములా తెర మీదకు వచ్చింది. అయితే ఇది సోషల్ మీడియాలో ప్రచారంగానే ఉంది. అధికారికంగా మాత్రం కాదు. కేవలం ఊహాగానాలుగనే ఈ ఫార్ములాను తెర మీదకు తెచ్చారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఈ ఫార్ములా ప్రకారం చూస్తే టీడీపీ మొత్తం సీట్లలో 65 శాతం తీసుకుంటుందని అంటున్నారు. అలాగే జనసేన కోరినట్లుగా 30 శాతం సీట్లను ఆ పార్టీకి కేటాయిస్తుంది అని అంటున్నారు. ఇక బీజేపీకి అయిదు శాతం ఇస్తారని అంటున్నారు. ఆ విధంగా చూస్తే సీట్ల సర్దుబాటులో కొత్త ఫార్ములా పొత్తులలో జనసేన ఘన విజయం సాధించినట్లే అని అంటున్నారు. బీజేపీ మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు కదిలే పరిస్థితి కనిపించడం లేదు అని అంటున్నారు. అయితే ఈ ఫార్ములా సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నా సాధ్యమయ్యే పనేనా అన్నది కూడా చర్చగా ఉంది. ఎందుకంటే తమ్ముళ్ళు ఏకంగా తమకు దక్కే సీట్లలో 35 శాతాన్ని కోల్పోవాల్సి ఉంటుంది. అంటే మూడవ వంతు అన్న మాట. ప్రతీ మూడు సీట్లలో ఒకటి టీడీపీకి దక్కదు అంటే అతి పెద్ద పార్టీ బూత్ లెవెల్ దాకా విస్తరించి ఉన్న పార్టీ సంస్థాగతంగా బలంగా ఉన్న టీడీపీలో తమ్ముళ్ళు ఊరుకుంటారా అన్నదే ప్రశ్నగా ఉండబోతోంది. అంతే కాదు వారు త్యాగానికి సిద్ధపడతారా అన్నది కూడా కీలకమైన ప్రశ్న. టీడీపీకి అందరి కంటే బలమైన నేతలు ఉన్నారు. ఆ పార్టీకి అన్ని సామాజిక వర్గాలలో పట్టున్న నేతలు ఉన్నారు. 34 శాతం బీసీలకు రిజర్వేషన్లు అంటే టీడీపీకి ఎక్కువ మంది అభ్యర్థులు కూడా ఈజీగా దొరుకుతారు అని అంటున్నారు. గడచిన రెండేళ్లుగా స్థానిక సంస్థల ఎన్నికల మీద కోటి ఆశలు పెట్టుకున్న టీడీపీ తమ్ముళ్ళు మూడవ వంతు సీట్ల కోతకు అంగీకరిస్తారా అన్నదే చూడాలి. ఏది ఏమైనా సీట్ల సర్దుబాటు అన్నది పీటముడిగా కూటమికి పడబోతోంది అని అంటున్నారు.

మహిళా రక్షణ-మహిళా సాధికారత నీటి మీద రాతలేనా?

మహిళా సమస్యలపై చిత్త శుద్ధిలేని పాలకుల వైఖరిలో "మార్పు రావాలి-మార్పు కావాలి"!

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విజయవాడ పశ్చిమ ఆగష్టు 22 :(వార్త ప్రభ ప్రతినిధి) మహిళా రక్షణ-మహిళా సాధికారతపై పాలకుల హామీలు నీటి మీద రాతలుగా మారాయి అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆగ్రహం వ్యక్తం చేసారు. మహిళా సమస్యలపై చిత్త శుద్ధి లేని పాలకుల వైఖరిలో "మార్పు రావాలి-మార్పు కావాలి" అనే నినాదంతో దేశవ్యాప్త నిరసనలకు ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యు జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం ఉదయం స్థానిక గవర్నర్ పేట, లెనిన్ సెంటర్ లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచాదార్ల దుర్గాంబ అధ్యక్షతన జరిగిన నిరసన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న అక్కినేని వనజ ధర్నా ని ఉద్దేశించి మాట్లాడుతూ సంపూర్ణ మహిళా సాధికారతను కాంక్షిస్తూ మా లక్ష్యం అని నమ్మబలికి మహిళా ఓట్లతో గద్దెనెక్కిన పాలక పక్షాలు ఏరుదాటిన తర్వాత తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తు మహిళా సమస్యలపై ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్నారని ఎద్దేవా చేసారు. దేశానికి స్వతంత్రం సిద్ధించి 80 సంవత్సరాలు గడచినా మహిళలను ద్విజాతి పౌరులుగానే పరిగణిస్తు నిర్ణయాధికారం, విద్య, ఉపాధి రంగాలలకు దూరం చేస్తూనే ఉన్నారని అన్నారు. నిత్యం పెరుగుతున్న నిత్యావసర ధరలు, పేదరికం, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు,దాడులు, విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం అమ్మకాలు, కరువైన ఆహార భద్రతా, క్షిణిస్తున్న ఆరోగ్య భద్రతా, సామాజిక వెనుకబాటు వంటి అనేక సమస్యలు మహిళలను కుంగదీస్తున్నాయని. పాలక పక్షాలు ఎటువంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా మహిళలను ఒక ఉత్పాదక కేంద్రంగా చూస్తూ మీరు ఇంతమందిని కనండి,అంత మందిని కనండి అంటూ ప్రభుత్వాలు నిర్దేశించడం వారి చవకబారుతనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్య దేశంలో నిర్ణయాధికారాన్ని కేంద్ర బిందువుగా ఉన్న చట్ట సభలలో నేటికీ మహిళకు సరైన ప్రాతినిధ్యం లేకుండా పోవడం శోచనీయం అని అన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం డీ లిమిటేషన్ షరతులు లేని, చట్ట సభలలో 33% మహిళా రిజర్వేషన్ బిళ్ళను చట్టంగా మార్చాలని, మహిళలపై అత్యాచారాలు, దాడులను అరికట్టేందుకు మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలనీ పెండింగ్ కేసులను పరిష్కరించి దోషులను కఠినంగా శిక్షించేందుకు ప్రత్యేక మహిళా కోర్టులను ఏర్పాటు చేయాలనీ, మహిళలను,వారి కుటుంబాలను సర్వనాశనం అవడానికి కారణం అవుతున్న మద్యాన్ని సంపూర్ణంగా నియంత్రించాలని, మహిళలకు కె.జి టు పి.జి ఉచిత విద్యను, మహిళలకు పౌష్టికాహారం, సంపూర్ణ వైద్యం సౌకర్యాలు అందిచాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 ఆర్థిక సహాయం అందిచాలని, నిత్యవసరాల ధరల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఈ సందర్భముగా డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శి లు సి.హెచ్.దుర్గా కోటేశ్వరరావు, బంక ఝాన్సీలక్ష్మి, నగర నాయకులు పి.రాణి, కె.శైలజ, దుర్గాసి రమణమ్మ, నీలాపు భాగ్యలక్ష్మి, దర్శనం పుష్పవతి, చింతాడ పార్వతి, అండిమాని నాగమణి, నక్కా రాజ్య లక్ష్మి, ఎస్.కె.నాగర్ బీ, ఆర్.అనసూయ, బేగం, అనసూయ, బుజ్జి,గుణ సుందరి, మురళి సాయి మణి, వేలాంగణి రాణి, రేగాని బుజ్జి,ఎం.సత్యవతి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు కేడర్ సర్వసన్నద్ధంగా ఉండాలి

- మాజీ మంత్రి వెలంపల్లి శ్రీవాసరావు పిలుపు

విజయవాడ పశ్చిమ ఆగష్టు 22 :(వార్త ప్రభ ప్రతినిధి) రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం నాడు స్థానిక బ్రాహ్మణ వీధిలోని వైసిపి పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ లతో ఆయన అధ్యక్షతన విస్తృత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ ఘన విజయం సాధించేలా ప్రతీ ఒక్కరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని స్పష్టం చేశారు. డివిజన్ల వారీగా కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలాన్ని మరింత పటిష్టం చేయాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం వైసిపి శ్రేణులు నిరంతరం పోరాడాలని దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని, ప్రజా సమస్యలపై గళమెత్తడంలో నాయకులు, కార్యకర్తలు వెనకడుగు వేయకూడదని ఆయన స్పష్టం చేశారు. డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజల హక్కుల సాధనకై ముందుకు సాగాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురు మాజీ కార్పొరేటర్లు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ లు పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల వ్యూహాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు.

ఎమ్మెల్సీ వర్ల రామయ్యకు ఏపీ జర్నలిస్టు ఫోరం ప్రతినిధుల శుభాకాంక్షలు

విజయవాడ పశ్చిమ ఆగస్టు 22: (వార్త ప్రభ ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడిగా నియమితులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వర్ల రామయ్యను ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం ప్రతినిధులు శనివారం విద్యాధరపురంలోని అయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం గౌరవ అధ్యక్షుడు అన్నవరపు బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి యేమినేని వెంకటరమణ, యాత్రలోకం ట్రావెల్ మ్యాగజైన్ సంపాదకుడు తాళ్లూరి అనిల్ కుమార్ తదితరులు వర్ల రామయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు వర్ల రామయ్యకు శాసన మండలి సభ్యుడిగా బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా అభినందనలు తెలియజేస్తూ, ప్రజా సమస్యలపై ఆయన తన అనుభవంతో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. వర్ల రామయ్య మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టు ఫోరం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు, మీడియా రంగానికి సంబంధించిన అంశాలపై తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు ఫోరం ప్రతినిధులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత - తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్

విజయవాడ పశ్చిమ ఆగష్టు 22 :(వార్త ప్రభ ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సర్కిల్--1 పరిధిలో కలర హాస్పిటల్ వద్ద, సర్కిల్--2 పరిధిలో అక్టప్ స్కూల్‌లో, సర్కిల్--3 పరిధిలో పటమటలోని గోవిందరాజుల స్కూల్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. పటమటలోని గోవిందరాజుల స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి విజయవాడ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు స్వచ్ఛతను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఇళ్లలో, కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో, వాణిజ్య ప్రాంతాల్లో ఉత్పత్తయ్యే వ్యర్థాలను బాధ్యతగా నిర్వహించాలని, చెత్తను రోడ్లపై, కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా నగరపాలక సంస్థ సూచించిన విధానంలో పారవేయాలని తెలిపారు. ప్రజలు తడి, పొడి వ్యర్థాలను మూలం వద్దనే వేరు చేసి అందించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని గద్దె రామ్మోహన్ సూచించారు. ఇంటి పరిసరాలు, రహదారులు, కాలువలు, పార్కులు, చెరువులు తదితర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధుల నివారణతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించవచ్చని అన్నారు. స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు సమష్టిగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛత విషయంలో కేవలం కార్యక్రమాల సమయంలోనే కాకుండా ప్రతిరోజూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన అన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ఇతరులకు కూడా స్వచ్ఛతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రతి పౌరుడు విజయవాడను మరింత పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలోని అన్ని వార్డుల్లో ఇంటింటి సర్వేలు నిర్వహించడంతో పాటు స్వచ్ఛత, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. హోటళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు తదితర సంస్థల వివరాలను సేకరించి నమోదు చేయడం, జియో ట్యాగింగ్ వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయా సంస్థల నిర్వాహకులు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, విద్యాసంస్థలు మరియు ఇతర సంబంధిత వర్గాలతో అవగాహన సమావేశాలు నిర్వహించి శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల వేర్పాటు, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు డాక్టర్ డి. చంద్రశేఖర్ తెలిపారు. నగరంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచేందుకు ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మార్కెట్ అసోసియేషన్లు, విద్యాసంస్థలు చురుకుగా భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు తమ ఇళ్లలో ఉత్పత్తయ్యే తడి వ్యర్థాలను హోమ్ కంపోస్టింగ్ ద్వారా సేంద్రీయ ఎరువుగా మార్చుకోవాలని, వర్షపు నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలను వినియోగించాలని, రహదారులు, కాలువలు, చెరువులు, సరస్సులు, పార్కులు, పర్యాటక ప్రాంతాలు తదితర బహిరంగ ప్రదేశాలను ప్లాస్టిక్ రహితంగా ఉంచాలని సూచించారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన విజయవాడను నిర్మించగలమని డాక్టర్ డి. చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముమ్మినేని వెంకటప్రసాద్, చీఫ్ ఇంజనీర్ పి. సత్యాకుమారి, జోనల్ కమిషనర్లు కె. షమ్మీ, కె. ప్రభుదాస్, ఎన్. శ్రీనివాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ గోపాల నాయక్, పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్, దుష్యంత్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె. శ్రీనివాస్, గోపాలకృష్ణమూర్తి, రామారావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సీడీవోలు శ్రీకాంత్, జగదీశ్వరి, ఉమామహేశ్వరరావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా "సుజనా ఫౌండేషన్" ఉచిత వైద్య సేవలు

విజయవాడ పశ్చిమ ఆగష్టు 22 :(వార్త ప్రభ ప్రతినిధి) పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలోని "సుజనా" ఫౌండేషన్" ద్వారా శనివారం కొత్తపేట,కే బీ ఎన్ కళాశాల నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి, పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి వారం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ వైద్య శిబిరంలో డెంటల్, కంటి పరీక్షలు, జనరల్ ఫిజీషియన్ వైద్య సేవలతో పాటుబీ పీ, షుగర్, ఈ సీ జీ,2డి ఎకో, ఎక్స్ రే, మరియురక్త పరీక్షలు, ఉచితంగా చేస్తున్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేద ,మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలనేసంకల్పం తోఎమ్మెల్యే సుజనా చౌదరి ఈ శిబిరాలను నిర్వహిస్తున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ శిబిరంలో 122 మందికి నిపుణులైన వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధతో చికిత్సలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.పీ వీ ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు,గవర్నమెంట్ డెంటల్ డాక్టర్స్ ,శంకర నేత్ర చికిత్సాలయ కంటి వైద్యులు, సుజనా ఫౌండేషన్ సిబ్బంది, సుజన మిత్రా కోఆర్డినేటర్లు ఈ శిబిరంలో తమ సేవలందించారు.

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న

విజయవాడ పశ్చిమ ఆగష్టు 22 :(వార్త ప్రభ ప్రతినిధి) విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో 53వ డివిజన్ కోమల విలాస్ సెంటర్‌లో సిటీ వైడ్ చిరంజీవి యువసేన విజయవాడ, పులిశెర రమేష్ ఆధ్వర్యంలో పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలను అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న పాల్గొని దివ్యంగులుతో కేక్ కట్ చెపించి చిరంజీవి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ, చిరంజీవి తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవడంతో పాటు, సేవా కార్యక్రమాల ద్వారా కూడా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ఆయన మరెన్నో సంవత్సరాలు ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. చిరంజీవి సేవా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నలు గురు దివ్యంగులకు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఐజా, పోటా నాగార్జున, చందనా సురేష్(మావ),విజయలక్ష్మి,ఎన్ విజయలక్ష్మి కనకరావు , అడ్డాల సాయి, ప్రసన్న, ఏసు బాబు, ఎస్ దుర్గారావు, పి శంకర్, బి రాంబాబు మరియు చిరంజీవి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తమలోని సృజనకు పదును పెట్టాలి

విజయవాడ పశ్చిమ ఆగష్టు 22 :(వార్త ప్రభ ప్రతినిధి) విద్యార్థులు తమలోని సృజనాత్మకశక్తికి పదును పెట్టినప్పుడు మరిన్ని విజయాలను అందుకుంటారని ప్రముఖ గాయకుడు షణ్ముఖ్ పుప్పాల అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఏఐ అండ్ ఎంఎల్ విభాగాల ఆధ్వర్యంలో కళాశాలలోని యురేకా విభాగ తొలి వార్షికోత్సవ వేడుకలు ఆ కళాశాల ఆవరణలో సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన గాయకుడు షణ్ముఖ్ పుప్పాల తన సంగీత ప్రదర్శనతో విద్యార్థులను అలరించారు. అలాగే మరో అతిథిగా హాజరైన స్టాండప్ కమెడియన్ దినేష్ దబ్బికర్ తన హాస్య ప్రదర్శనలత సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమలోని నైపుణ్యాలకు పదును పెట్టాలన్నారు. విద్యతో పాటుగా సాంస్కృతిక, క్రీడాంశాలపైనా పట్టు సాధించాలని సూచించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లోనూ ప్రొత్సాహించే లక్ష్యంతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర ఎస్ శరవణకుమార్, విభాగాధిపతి వీ సవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రి స్కాన్నింగ్ పాయింట్ దుర్గగుడి ఈవో సీనా నాయక్ఆకస్మిక తనిఖీ

విజయవాడ పశ్చిమ ఆగష్టు 22 :(వార్త ప్రభ ప్రతినిధి) ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో వీకే సీనా నాయక్ ఆలయ పరిధిలోని స్కాన్నింగ్ పాయింట్‌ను స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నమోదు పుస్తకాల పరిశీలన: స్కాన్నింగ్ పాయింట్ వద్ద ఉన్న విఐపి ఎంట్రీ రిజిస్టర్ మరియు ఇతర రికార్డులను ఈవో గారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇన్‌ఛార్జ్‌కు ఆదేశాలు: స్కాన్నింగ్ పాయింట్ ఇన్‌ఛార్జ్ అనురాధ (జూనియర్ అసిస్టెంట్) కు విధులకు సంబంధించి పలు కీలక సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు. సెల్‌ఫోన్లపై కఠిన నిబంధనలు: ఆలయ భద్రతా నియమాల్లో భాగంగా స్కాన్నింగ్ పాయింట్ వద్ద సెల్‌ఫోన్ల నియంత్రణపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్రమశిక్షణే ముఖ్యం: స్కాన్నింగ్ పాయింట్ వద్ద సిబ్బంది అంతా అత్యంత క్రమశిక్షణతో వ్యవహరించాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తనిఖీలు వేగవంతం చేయాలని ఈవో ఆదేశించారు.

పూజనీయులు పెద్దలు



గౌరవించు భక్తితో
సేవించు శ్రద్ధతో
పూజనీయులు పెద్దలు
హత్తుకొనుము మనసుతో
పలకరించు ప్రేమతో
సహకరించు ఓర్పుతో
మహనీయులు పెద్దలు
తేనెలూరు పలుకులు
మసలుకో వినయంతో
సాయపడు చెలిమితో
అనుభవజ్ఞులు పెద్దలు
వారుంటే దీవెనలు
సదనంలో వేల్పులు
చూడ కల్పతరువులు
వయసులోన పెద్దలు
దిద్దుతారు బ్రతుకులు

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందిద్దాం.

స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర స్ఫూర్తిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి
జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎం. నవీన్

మచిలీపట్నం ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని వారసత్వంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజలందరి బాధ్యతగా భావించి పూర్తి స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎం. నవీన్ పిలుపునిచ్చారు.స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మచిలీపట్నం నగరం మూడు స్తంభాల సెంటర్ సమీపంలోని మచిలీపట్నం--విజయవాడ జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో విస్తృత పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఇంచార్జి కలెక్టర్, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి స్వయంగా చీపురు పట్టి రహదారి పరిసరాలను శుభ్రం చేసి, చెత్తాచెదారాలను తొలగించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భవిష్యత్ తరాలకు ఎలాంటి పర్యావరణాన్ని వారసత్వంగా అందిస్తున్నామనే అంశాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు ఆస్తులు కూడబెట్టడం మాత్రమే కాదని, వారికి ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన పర్యావరణాన్ని కూడా వారసత్వంగా అందించాలని పేర్కొన్నారు.ప్రతి ఇంట్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయడం, బహిరంగ ప్రదేశాల్లో పేపర్లు, చెత్తాచెదారాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చూడటం, పర్యావరణహిత జీవన విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. మనకు లభించిన పర్యావరణాన్ని కాపాడుకోవడమే కాకుండా, మనకు అందిన దానికంటే మరింత మెరుగైన పర్యావరణాన్ని భావితరాలకు అందించడమే నిజమైన బాధ్యత అని తెలిపారు.స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని కార్యాలయాలకే పరిమితం చేయకుండా ప్రతి ఇంటికీ, ప్రతి ప్రాంతానికీ తీసుకెళ్లాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో నిర్వహిస్తున్న పరిశుభ్రత కార్యక్రమాలకు వివిధ ప్రభుత్వ శాఖలు నిరంతరం భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొంటూ, కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ విషయంలో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అందరూ భాగస్వాములు కావాలని, స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేయాలని ఇంచార్జి కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తూ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి ఎస్డిసి పి నీలకంఠేశ్వరరెడ్డి, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మున్సిపల్ మెడికల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ దయాకర్, బిసి సంక్షేమ శాఖ అధికారి జి రమేష్, ఏపీఎస్ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో రాధిక, తదితర అధికారులు, ఉద్యోగులు, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ లకు 4 వ రోజు " జ్ఞాన జ్యోతి " ట్రైనింగ్

పెనుగంచిప్రోలు - ఆగస్టు 22(వార్త ప్రభ) ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ప్రాజెక్ట్ ఐ సి డి ఎస్ సి డి పి ఓ సత్యవతి ఆదేశాల మేరకు చిల్లకల్లు ప్రాజెక్టు పరిధిలోని పెనుగంచిప్రోలు కె.వి.ఆ.ర్.జడ్పీ. బాయ్స్ హైస్కూల్ నందు శనివారం జగ్గయ్యపేట వత్సవాయి పెనుగంచిప్రోలు మూడు మండలాల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ నాలుగవ రోజు నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలకు ప్రీస్కూల్ మైల్ స్టోన్స్ గురించి యాక్టివిటీస్ గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో వెన్యూ ఆఫీసర్ రాము సార్ మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్త వృత్తి పిల్లలను బాగా భారత పౌరులుగా చేసే అవకాశం చాలా గొప్పది అని వివరించారు. అదేవిధంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ సోమనాగేశ్వరరావు ఆరేపల్లి ప్రకాష్ ,మర్రి ప్రభాకర్ , సూపర్వైజర్స్ రజిని జ్వాల వెంకట కుమారి కార్యకర్తలు పాల్గొన్నారు...

వర్షాకాలంలో పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఎస్వీ వైద్య కళాశాలలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

తిరుపతి, ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) వర్షాకాలంలో ప్రజలు, సిబ్బంది పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి ప్రభు మాట్లాడుతూ ఆగస్టు నెలలో ప్రతి ఒక్కరూ ఆరు ముఖ్యమైన పరిశుభ్రత సూత్రాలను పాటించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త లేకుండా చూడటం, మురుగు కాలువలను శుభ్రం చేసి నీరు నిల్వకుండా చేయడం, చేతులను పరిశుభ్రంగా కడుక్కోవడం, ఇళ్ల పరిసరాల్లో చెత్త, నీరు నిల్వకుండా చూడటం, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడం, సమష్టిగా పరిసరాల పరిశుభ్రతను కాపాడటం ముఖ్యమన్నారు.వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని, తాగునీటి నాణ్యతను పరీక్షించాలని, చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయాలని సూచించారు. "వర్షాకాలం--పరిశుభ్రతతో ఆరోగ్యం", "నీరు నిలవనివ్వం--దోమలను పెరగనివ్వం" అనే నినాదాలతో అవగాహన కల్పించారు.అనంతరం వైద్యులు, వైద్య సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు, పారిశుద్ధ్య కార్మికులతో పరిశుభ్రత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డి.ఎస్.ఎన్. మూర్తి, విభాగాధిపతులు డాక్టర్ జగదీష్, డాక్టర్ యు. భారతి, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ చరిత, డాక్టర్ శివకళ, డాక్టర్ శశికళ, ఏపీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏటుకూరి గిరిబాబు, ఉద్యోగ సంఘాల నాయకులు, వైద్యులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, పీఆర్వో వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజికాంశాలు స్పృశించేలా పరిశోధనలు

- ఐఐటి (చెన్నై) ఆచార్యులు ధనవేల్.

మచిలీపట్నం ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)భాష, సంస్కృతి కు సంబంధించి చేసే పరిశోధనల్లో సామాజికాంశాలు స్పృశించేలా ఆలోచనలు చేయాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (చెన్నై) ఆచార్యులు ఎస్ పి ధనవేల్ సూచించారు. శనివారం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పరిశోధనా దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశోధకులు పాటించాల్సిన విధులు గురించి సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య కె. రాంజీ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.కోటేశ్వరరావు, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య పి. వీరబ్రంహచారి, పరిశోధన, అభివృద్ధి విభాగం సమన్వయకర్త ఆచార్య మారుతి, విజయవాడ ఎన్ టి ఆర్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ఆచార్య దిలీప్, పలు విభాగాల పరిశోధకులు పాల్గొన్నారు.

వైభవంగా దొరసానమ్మ గంధ మహోత్సవం

హైకోర్టు ఆదేశాలతో గంధకలశం ఎత్తిన సజ్జద హఫీజ్ పాషా

అనుమసుద్రం పేట ఆగష్టు 22 (వార్తాప్రభ ప్రతినిధి) ఏఎస్‌పేట మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ ఏ రసూల్ స్వాములవారి ధర్మపత్ని శ్రీ హబీబా ఖాతూన్ అమ్మజాన్ దొరసానమ్మల 253వ గంధ మహోత్సవం శుక్రవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ ఏడాది గంధ మహోత్సవం ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది.హైకోర్టు ఆదేశాలతో మూడు సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ న్యాయ పోరాటం తర్వాత దర్గా సజ్జాదానషీన్ ఎస్జీఎన్ హఫీజ్ పాషా గంధకలశం ఎత్తుకోవడం విశేషం.ముందుగా సుగంధ ద్రవ్యాలు అత్తరు పన్నీరులతో కలిపి తయారు చేసిన గంధాన్ని గంధ కలశంలో నింపారు. హైకోర్టు ఆదేశాల మేరకు హక్కును దక్కించుకున్న సజ్జాదానషీన్ ఎస్జీఎన్ హఫీజ్ పాషా ఆ గంధ కలశాన్ని తలపై ఉంచుకొని మహల్ నుండి ఊరేగింపుగా బయలుదేరారు. మేళతాళాలు భక్తి కీర్తనలు ఫకీర్ల జరుబులు బాణసంచా మోతల నడుమ భక్తజన సందోహం మధ్య హజ్రత్ వారి దర్గాకు చేర్చారు.అనంతరం హజరత్ అమ్మవార్ల సమాధులకు గంధం లేపనం చేసి ప్రత్యేక ఫాతిహా సలాములు పఠించి గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు.ఈ గంధ మహోత్సవాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుండి భక్తులు భారీగా హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆత్మకూరు సంగం సీఐలు గంగాధర్ శ్రీనివాసులు రెడ్డి స్థానిక ఎస్ఐ జిలానీ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థులకు ఎయిడ్స్ పై అవగాహన

చేజర్ల ఆగష్టు 22 (వార్తాప్రభ) చేజర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కంట్రోల్ సొసైటీ మరియు నెల్లూరు జిల్లా దిశ వారి ఆదేశాల మేరకు లింక్ వర్కర్ స్కీం వారి తరఫున ఆత్మకూరు శశికళ విద్యార్థులకు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఫ్లెక్సీ ఐఈసి హెచ్ఐవి అంటే ఏమిటో ఎలా వ్యాపిస్తుందో విద్యార్థులకు వివరించారు.అలాగే టీబి అంటే ఏమిటో అది ఎలా వ్యాపిస్తుందో విద్యార్థులకు అవగాహన కల్పించారు.ప్రతి విద్యార్థి ఈ విషయాలను తప్పక గుర్తుంచుకొని వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో చేజర్ల హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రావణ్ మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

కళాత్మకంగా స్వయం ఉపాధి..

- సృజనాత్మకతకు శిక్షణతో మహిళలకు ప్రోత్సాహం - ఎకో క్రాఫ్ట్, ఫైన్ ఆర్ట్స్‌లో అవకాశాలను సద్వినియోగం చేసుకోండి - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం,ఆగష్టు 22(వార్తా ప్రభ ప్రతినిధి): మహిళలు తమలోని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలను ఒడిసిపట్టుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్వయం సహాయక సంఘాల మహిళలకు సూచించారు.శనివారం ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి రైజ్ కేంద్రంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఎకో క్రాఫ్ట్, ఫైన్ ఆర్ట్స్‌పై వర్క్‌షాప్ జరిగింది. నారీ వస్త్ర ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు సుష్మ 70 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ మహిళల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పర్యావరణహిత వస్తువుల తయారీ, కళాత్మక ఉత్పత్తుల రూపకల్పన వంటి అంశాల్లో శిక్షణ పొందడం ద్వారా ఇంటి వద్దే ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను ఆచరణలో పెట్టి స్వయం ఉపాధికి మార్గాలు వేసుకోవాలన్నారు. తయారు చేసిన ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ కల్పించడం, మార్కెట్ అవసరాలు, ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులను రూపొందించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడం ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిగతులతో పాటు సమాజ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల ద్వారా అందిస్తున్న శిక్షణ, ప్రోత్సాహకాలు, స్వయం ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి- డీఈవో చంద్రకళ సూచన

ఇబ్రహీంపట్నం, ఆగష్టు 22 (వార్తా ప్రభ ప్రతినిధి): ఈ విద్యా సంవత్సరం 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు సమష్టి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ సూచించారు. మూలపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ లో శనివారం జరిగిన స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రధానంగా ఎన్రోల్మెంట్ డ్రైవ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు నూరు శాతం నమోదు కావాలని సూచించారు. మాధ్యమిక స్థాయి, భౌతిక శాస్త్రం, జీవ రసాయన శాస్త్రానికి సంబంధించిన క్లస్టర్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రశస్త యాప్, ఎన్రోల్మెంట్ తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. విద్యా రంగంలో ఎన్టీఆర్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

శ్రీసిటీలో అలరించిన సంగీత విభావరి

శ్రీసిటీ, ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమం శ్రోతలను ఎంతగానో అలరించింది. సూళ్లూరుపేట కె ఎస్ కళానిలయంకు చెందిన కుమారి కంచెర్ల చంద్రలేఖ బృందం అన్నమాచార్యులు, శ్రీరామదాసు తదితర వాగ్గేయకారుల భక్తి కీర్తనలను మధురంగా ఆలపించారు.గణపతి ప్రార్థనతో ప్రారంభమై, కుమారి మోక్షిత శ్రీమద్భగవద్గీత పఠనం అనంతరం చంద్రలేఖ, వంశీ, మాచర్ల బత్తినయ్య భక్తి గీతాలతో సంగీత విభావరి కార్యక్రమం శ్రవణానందంగా, రసమయ భరితంగా సాగింది. గాయకులకు సంగీత కళాకారులు మాచర్ల బత్తినయ్య (కీబోర్డ్), కొండ వీరస్వామి (తబల) వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమం అనంతరం శ్రీవాణి తరుపున కళాకారులను ఘనంగా సత్కరించారు.శ్రీసిటీ ఉద్యోగులు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, సాంస్కృతిక ప్రియులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీసిటీ పచ్చని పరిసరాలు, ఆలయ ప్రశాంత వాతావరణం మధ్య భక్తి, సాహిత్యం, సంగీతం సమ్మేళనంగా ఈ కార్యక్రమం నిలిచింది. భక్తులకు తీర్థ, అన్నప్రసాదం పంపిణీ చేశారు. అలాగే శనివారం ఉదయం ఆలయంలో సంప్రదాయ గోపూజ నిర్వహించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. శ్రీసిటీ పిఆర్ ప్రతినిధి పల్లేటి బాలాజీ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓటర్లు సవరణ షెడ్యూల్‌ను వినియోగించుకోండి : తహసీల్దార్



గుడ్లవల్లేరు:ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఓటర్లు సవరణ షెడ్యూల్‌ను వినియోగించుకోవాలని తహసీల్దార్ బి.లోకరాజు తెలిపారు. శనివారం అంగలూరులో అనామలీస్‌కు సంబంధించి శనివారం నిర్వహించిన సభలో ఓటర్ల నుంచి ధవపత్రాలను ఆయనతో పాటు గుడ్లవల్లేరులో ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ స్వీకరించారు. క్లెయిములు, అభ్యంతరాలను సెప్టెంబరు 28వ తేదీ వరకు దాఖలు చేయవచ్చునని తహసీల్దార్ లోకరాజు తెలిపారు. అక్టోంబరు 10వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. ఓటర్ల నుండి చేర్పులు, తొలగింపులు మరియు సవరణలు (ఫారం 6, 7,8) క్లెయిములు స్వీకరించుటకు స్పెషల్ క్యాంపులను ఆగస్టు 23, 29, 30వ తేదీల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆయా పోలింగు కేంద్రాల పరిధిలో సంబంధిత బీఎల్ఓ ద్వారా స్వీకరించబడునని చెప్పారు. ఓటర్లు తమ పేర్లను పరిశీలించుకొనుటకు సంబంధిత బీఎల్వోల వద్ద డ్రాఫ్ట్ ఫోటో ఓటర్ల జాబితా ఏఎస్‌డీడీ జాబితాలు మరియు ఫారం 6, 7, 8 -- 8ఏ లకు సంబంధిత బీఎల్వోల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. 18--19 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్ల కొత్తగా ఓటు నమోదు చేసుకొనుటకు కొరకు ఫారం -- 6తో పాటు డిక్లరేషన్ ఫారం (ఎన్నెక్యూచర్ - డి) కూడా జతపరచి దరఖాస్తు చేయవలసినదిగా కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక క్యాంపుల్లో వారి బూత్ లెవల్ ఏజెంట్లు కూడా హాజరు అయ్యేలా చూడవలసినదిగా సూచించారు. యు ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారి ఓటు నమోదు చేసుకోవలసినదిగా తహసీల్దార్ లోకరాజు కోరారు.

గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తో సుజనా చౌదరి ఆత్మీయ భేటీ

విజయవాడ పశ్చిమ ఆగష్టు 22 :(వార్త ప్రభ ప్రతినిధి) వికసిత్ భారత్ -2047 కార్యక్రమంలో భాగంగా విజయవాడ వచ్చిన గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మరియు ప్రజా ప్రతినిధులతో మాజీ కేంద్ర మంత్రి వర్యులు, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే (సుజనా చౌదరి) భేటీ అయ్యారు.పర్యటనలో భాగంగా తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కు సుజనా చౌదరి శాలువా కప్పి, బొకే ఇచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం వారిని విందుకు ఆహ్వానించారు.ఈ విందు కార్యక్రమంలో ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీ వీ ఎన్ మాధవ్, మెదక్ ఎంపీ రఘునందన్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టి.ఆర్.ఎస్. డివిజన్ అధ్యక్షుడిగా గుండె దయానంద్ ముదిరాజ్

శేరిలింగంపల్లి,ఆగష్టు 22 (వార్తాప్రభ):తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 241- మక్తా మహబూబ్‌పేట్ డివిజన్ అధ్యక్షుడిగా గుండె దయానంద్ ముదిరాజ్ నియమితుల య్యారు.ఈ మేరకు టీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు,పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ సూచించారు.మక్తా మహబూబ్‌పేట్ డివిజన్‌లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గుండె దయానంద్ ముదిరాజ్ తెలిపారు.

పాలకులను నిలదీసే పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం

- హైదరాబాద్‌లో లాంఛనంగా 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' ప్రారంభం
- జర్నలిజం కేవలం వ్యాపారం కాదు.. అదొక సామాజిక బాధ్యత
- ఖర్గే సభ తర్వాత జరిగిన శుద్ధీకరణ గురించి ప్రశ్నించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి):ప్రజాస్వామ్య మనుగడకు పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్ లో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ద హిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్. రామ్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సంగీత బారోచ్, కరవన్ పత్రిక ఎడిటర్ అనంతనాథ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్ నుంచి గౌతమ్ లహరి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారతీయ జర్నలిజం వారసత్వాన్ని, ప్రస్తుత సవాళ్లను ఆయన సోదాహరణంగా వివరించారు.వివక్షను ప్రశ్నించాల్సిన బాధ్యత పత్రికలదే అని చెప్పారు. ?సమాజంలో జరుగుతున్న ఘటనలను కేవలం రిపోర్ట్ చేయడమే కాకుండా, వాటి అంతరార్థాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత జర్నలిజంపై ఉందని భట్టి స్పష్టం చేశారు. ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హల్వ్వానీలోని రామ్‌లీలా మైదానంలో ప్రసంగించిన రెండు రోజుల తర్వాత, కొందరు అక్కడ 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడాన్ని ఆయన ప్రశ్నించారు. ఎనిమిది దశాబ్దాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఏఐసీసీ అధ్యక్షుడు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడి పట్ల బహిరంగంగా ఇలా జరిగితే... దేశంలో సమానత్వం, గౌరవం ఏ స్థాయిలో ఉన్నాయో ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో మనం ఇంకా ఎంత దూరం ప్రయాణించాలో ఈ ఘటన తెలియజేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.జాతీయోద్యమంలో పత్రికలది చెరగని ముద్రభారతదేశ నిర్మాణంలో జర్నలిజం ఒక అంతర్భాగమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కగుర్తుచేశారు. జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం కాదని, పౌరులను తీర్చిదిద్దడమని ఆయన చెప్పారు. పేర్కొన్నారు. యంగ్ ఇండియా, నవజీవన్, హరిజన్ పత్రికల ద్వారా జాతిపిత మహాత్మా గాంధీ ప్రజలను స్వాతంత్ర్యోద్యమం వైపు మళ్లించారని అన్నారు. మూక్ నాయక్, బహిష్కృత భారత్ వంటి పత్రికలను బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించి అణగారిన వర్గాలకు గొంతుకనిచ్చారని అన్నారు. కేసరి, మరాఠా పత్రికల ద్వారా లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వలస పాలకులను సవాలు చేశారని అన్నారు. దాదాభాయ్ నౌరోజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి వారంతా పత్రికలను సామాజిక, రాజకీయ సంస్కరణలకు ఆయుధాలుగా మలిచారని ఆయన కొనియాడారు. ఆ కాలంలో అమృత బజార్ పత్రిక, ది హిందూ వంటివి ప్రజల గొంతుకలుగా నిలిచాయని చెప్పారు. ప్రజాస్వామ్యంలో పాలకులకు, పత్రికలకు మధ్య ఉండాల్సిన సంబంధాన్ని ఒక చారిత్రక సంఘటనతో ఉపముఖ్యమంత్రి వివరించారు. 1948లో 'శంకర్స్ వీక్లీ'లో తనను నిరంతరం కార్టూన్లతో విమర్శించే శంకర్‌తో అప్పటి ప్రధాని నెహ్రూ "నన్ను కూడా విడిచిపెట్టవద్దు, శంకర్" అన్న మాటలను భట్టి గుర్తుచేశారు. ఒకప్పుడు పత్రికా సంపాదకుడి పదవికి దేశంలో రెండో అత్యంత ముఖ్యమైన స్థానం ఉండేదని, రామ్‌నాథ్ గోయెంకా లాంటి యజమానులు ప్రభుత్వాలను సైతం సవాలు చేసేవారని ఆయన అన్నారు. నేటి వార్తా

సంస్థలు కేవలం బ్యాలెన్స్ షీట్లకు, వాణిజ్య ప్రయోజనాలకు పరిమితం కాకుండా ఆనాటి విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

డిజిటల్ యుగంలో 'విశ్వసనీయతే' ఆయుధం సోషల్ మీడియా భావప్రకటనా స్వేచ్ఛను విస్తృతం చేసినప్పటికీ, స్వేచ్ఛ అంటే బాధ్యతారాహిత్యం కాదని ఆయన హితవు పలికారు. "నా పిడికిలిని ఊపే హక్కు, అది నీ ముక్కు వద్దకు చేరే వరకు మాత్రమే" అన్న సామెతను గుర్తు చేస్తూ... ఒకరి ప్రతిష్టను దెబ్బతీసే లైసెన్స్‌గా భావప్రకటనా స్వేచ్ఛ మారకూడదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతికతలతో పుకార్లు దేశమంతా వ్యాపిస్తున్న ఈ కాలంలో... జర్నలిస్టులకు అసలైన ఆస్తి 'విశ్వసనీయత' మాత్రమేనని ఉద్ఘాటించారు.

జిల్లా రిపోర్టర్ల రక్షణే ముఖ్యం కొత్తగా ఏర్పాటైన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' కేవలం ఒక సంస్థగా మిగిలిపోకుండా, జర్నలిస్టుల భద్రతను, వృత్తిపరమైన ప్రమాణాలను కాపాడే బలమైన వ్యవస్థగా ఎదగాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. గ్రామీణ స్థాయిలో, జిల్లాల్లో పనిచేసే రిపోర్టర్ల సంక్షేమంపై ఫెడరేషన్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో టీచర్ లేకపోయినా, ఆసుపత్రిలో డాక్టర్ లేకపోయినా, పౌరులు ఇబ్బందుల్లో ఉన్నా ప్రభుత్వానికి ముందుగా తెలిసేది జిల్లా రిపోర్టర్ల ద్వారానే అని, వారే ప్రభుత్వానికి 'అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ అని ఆయన కొనియాడారు.

తెలంగాణ గడ్డపై స్వేచ్ఛకు పెద్దపీటమనసులోని మాటను నిర్భయంగా వ్యక్తపరిచే స్వేచ్ఛ తెలంగాణ గడ్డ స్వభావంలోనే ఉందని, తమ ప్రభుత్వం ఆ సంప్రదాయాన్ని పూర్తిగా గౌరవిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నెహ్రూ చెప్పినట్లుగానే "మమ్మల్ని కూడా విడిచిపెట్టవద్దు.. స్వేచ్ఛగా మాట్లాడండి, స్వేచ్ఛగా ప్రశ్నించండి. ఆ విమర్శలను వినే ధైర్యం అధికారంలో ఉన్న మాకు ఉంది" అని ఆయన జర్నలిస్టులకు భరోసా ఇచ్చారని అన్నారు.ఈ కాలంలో సమాచార కొరత లేదు.. నమ్మకం కొరత ఉంది. అందరూ ప్రచురించగలిగే పరిస్థితుల్లో జర్నలిస్టు వద్ద అత్యంత విలువైన ఆస్తి ప్రింటింగ్ ప్రెస్ కాదు.. విశ్వసనీయత అని భట్టి విక్రమార్క అన్నారు.జర్నలిజాన్ని రక్షించాలంటే జర్నలిస్టులను కూడా రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల భద్రత, గౌరవం, ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఫెడరేషన్‌ను కోరారు. ముఖ్యంగా జిల్లా, చిన్న పట్టణాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోవాలని సూచించారు.గ్రామీణ, జిల్లా స్థాయి జర్నలిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడం, ఆసుపత్రుల్లో వైద్యులు లేకపోవడం, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కాకపోవడం వంటి అంశాలను ప్రభుత్వానికి ముందుగా

తెలియజేసేది తరచుగా స్థానిక జర్నలిస్టులేనన్నారు. "ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉంటే.. మంచి జర్నలిస్టు ప్రభుత్వానికి అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ వంటివారు" అని పేర్కొన్నారు.తెలంగాణ ప్రజల స్వభావంలోనే స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే సంప్రదాయం ఉందని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ఉద్యమాలు, సాహిత్యం, సంస్కృతిపై ఈ స్వభావం ప్రభావం చూపిందని తెలిపారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు తెలంగాణలో ఎంతో ప్రాధాన్యత ఉందని, తమతో విభేదించే గొంతుకలను వినే ధైర్యం ప్రజా జీవితంలో ఉన్నవారికి ఉండాలని అన్నారు.కొత్తగా ఏర్పడిన ఫెడరేషన్ కేవలం మరో సంస్థగా కాకుండా ఒక బలమైన సంస్థగా ఎదగాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.

"అధికారంలో ఉన్నవారిని వదలకండి.. అదే సమయంలో మీ వృత్తి ప్రమాణాలను కూడా వదలకండి. మమ్మల్ని జవాబుదారీగా ఉంచండి. మిమ్మల్ని మీరు మీ ప్రమాణాలకు జవాబుదారీగా ఉంచుకోండి. ఈ రెండింటి ప్రయోజనం చివరికి పౌరుడికే దక్కాలి" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ విజయవంతంగా ముందుకు సాగాలని, దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యతకు, సంక్షేమానికి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.ప్రెస్ క్లబ్ స్థలాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని బట్టి విక్రమార్క ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ది హిందూ పత్రిక మాజీ ఎడిటర్ రామ్ మాట్లాడుతూ దేశంలోని ప్రెస్ క్లబ్ లు సమిష్టిగా ఫెడరేషన్ గా ఆవిర్భవించడం జర్నలిస్టులుతమ గలాన్ని బలంగా వినిపించేందుకు ఒక వేదిక ఏర్పడిందన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు విపరీతంగా పెరిగాయని రామ్ ఆందోళన చేశారు. జర్నలిస్టుల పక్షాన న్యాయపోరాటం చేయడానికి కపిల్ శివలి ఉచితంగా న్యాయ సాయం చేయడానికి ముందుకు వచ్చారని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఎనిమిది ప్రెస్ క్లబ్లు ఈ ఫెడరేషన్ లో భాగస్వామి కాగా చెన్నై, బెంగళూరు, తిరువనంతపురం క్లబ్లు ఫెడరేషన్ లో చేరుతున్నాయి. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా విజేతలకు జ్ఞాపక నగదు బహుమతి, జ్ఞాపిక లతో సహా పురస్కారాలను ముఖ్య అతిథులు అందజేశారు. ఢిల్లీ, కోల్కత్తా, త్రిపుర, మధ్యప్రదేశ్, ముంబై, అహ్మదాబాద్, చెన్నై, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ప్రతినిధులు సహా హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఏ. రాజేష్ యాదవ్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీ చిలుకూరి హరిప్రసాద్, వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యులు ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ఉమాదేవి, ముత్యాల సత్తిబాబు, అమిత్ బట్టు, రచన ముడుంబై, వనం నాగరాజు,మర్యాద రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి పూర్తిస్థాయి నిధులు

మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు

ఇబ్రహింపట్నం, ఆగస్టు 22(వార్తా ప్రభ ప్రతినిధి): కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కి పూర్తిస్థాయి నిధులు సేకరిస్తున్నట్లు తెలిపారు మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా శనివారం మున్సిపాలిటీ 7వ డివిజన్ లో 15 లక్షల డి ఎం ఎఫ్ టి నిధులతో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు చైర్మన్. పూజా కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కట్టుబడి ఉన్నారని తెలిపారు. అభివృద్ధికి అవసరమైన నిధులను సమీపిస్తున్నారని అందులో భాగంగా డిఎంఎఫ్టి నిధులతో డ్రైనేజీ సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బసవ ఉమామ హేశ్వరరావు,టిడిపి పట్టణ అధ్యక్షుడు కరిమకొండ బాలాజీ, టిడిపి నాయకులు కుమ్మరి శ్రీనివాసరావు,చుట్ట కుదురు వాసు, అప్సర్‌నీలం జాన్ బాబు ,కూరేటి చక్రవర్తి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం

రెడ్డిగూడెం ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి):రెడ్డిగూడెం మండల జడ్పీహెచ్ఎస్ రెడ్డిగూడెం నందు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి మండల విద్యాశాఖ అధికారులు కే శంకర్రావు మరియు పి రమేష్ బాబు హాజరయ్యారు.ఈ సమావేశానికి 32 మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు,51 మంది ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు హాజరవ్వటం జరిగింది. ఈ సమావేశానికి క్లస్టర్ కాంప్లెక్స్ చైర్మన్ ఐ ధర్మశీల పాల్గొన్నారు.

బందరు నుంచి మంగినపూడి బీచ్ వరకు శోభాయాత్ర...

మచిలీపట్నం, ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)వినాయక చవితి సందర్భంగా కృష్ణా జిల్లా మచిలీపట్నం మంగినపూడి బీచ్ వద్ద ఏర్పాటు చేస్తున్న 63 అడుగుల వినాయక విగ్రహానికి మట్టి సమర్పణ కార్యక్రమాన్ని శోభాయాత్ర గా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సాగర తీర మహాగణపతి ఉత్సవ సేవా సమితి నాయకులు శనివారం వివరించారు.మచిలీపట్నం కన్యకా పరమేశ్వరి దేవాలయ సమావేశపు హాలులో ఉత్సవ కమిటీ అధ్యక్షులు చలమలచెట్టి నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో శోభాయాత్ర వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు చలమల శెట్టి నరసింహారావు మాట్లాడుతూ శోభాయాత్ర కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మూడు స్తంభాల సెంటర్ వద్ద గల వినాయక గుడి నుండి ప్రారంభమవుతుందన్నారు.మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జరిగే ఈ శోభాయాత్రలో దాదాపు 5 వేల మంది భక్తులు పాల్గొంటారన్నారు. మచిలీపట్నం తో పాటు పరిసర 12 గ్రామాల ప్రజలు పాల్గొని ఆయా ప్రాంతాల నుంచి సేకరించిన మట్టిని శోభాయాత్ర ద్వారా వినాయక విగ్రహం తయారీకి సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ శోభాయాత్ర ఆద్యంతం ఆధ్యాత్మిక భావనతో సాగుతుందన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ,అన్నవరం సత్యనారాయణ స్వామి రథాలతోపాటు చిన్న తిరుపతిగా పేరుగాంచిన ద్వారకాతిరుమల మచిలీపట్నం పాండురంగ స్వామి దేవాలయం కు సంబంధించిన రథాలు ఈ శోభాయాత్రలో ప్రత్యేకతను సంతరించుకుంటాయన్నారు శోభాయాత్రకు కోనేరు సెంటర్లో 108 మంది మహిళలు హారతి పడతారని అలాగే బీచ్ రోడ్ లో గల అన్ని గ్రామాల ప్రజలు శోభాయాత్రకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విగ్రహ కమిటీ నాయకులు కోరారు.

సి.పి.యం.నాయకులు కామ్రేడ్ గజ్జి పెద్ది రాజు మృతి

పెనుగంచిప్రోలు - ఆగస్టు 22(వార్త ప్రభ) పెనుగంచిప్రోలు మండల సి.పి.యం. నాయకులు, మాజీ ఎం పి టీ సి సభ్యులు గజ్జి పెద్ది రాజు(88) అనారోగ్యం శనివారం సాయంత్రం మృతి చెందారు.వీరి మృతి తో యాదవ బజారు న విచాద సాయలు అలుముకున్నాయి.వీరు ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ లో చురుకుగా, క్రియాశీలక కార్యకర్తగా రైతు సంఘం లో, వ్యవసాయకార్మిక సంఘం లో పనిచేసే వారు. కమ్యూనిస్ట్ పార్టీ చీలిన తరువాత పుచ్చల పల్లి సుందరయ్య నాయకత్వం లో సి.పి.యం. పార్టీ లో సభ్యులు గా ఇప్పటికి కొనసాగుతున్నారు. వీరి మరణ వార్త వినీ మండల సి.పి.యం నాయకులు దార నాగేశ్వర రావు,వి.గురవయ్య, రామారావు, తురక కొండలు, ఉండబోయిన దన్నమ్మ తదితరులు కామ్రేడ్ పెద్ది రాజు మృత దేహం పై ఎర్రజెండాను కప్పి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

"డివైన్ వేస్ట్ డ్రైవ్ - 2026" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన

- చిత్తారమ్మ దేవాలయం వద్ద అర టన్ను డివైన్ వ్యర్థాల సేకరణ
- ఆధ్యాత్మికతను గౌరవిస్తూ శాస్త్రోక్తంగా రీసైక్లింగ్ చేపట్టిన సీఎమ్‌సీ అధికారులు

గాజులరామారం, ఆగస్టు 22, (వార్తాప్రభ) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎమ్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "డివైన్ వేస్ట్ డ్రైవ్ -- 2026" కార్యక్రమంలో భాగంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని చిత్తారమ్మ దేవాలయం వద్ద డివైన్ వేస్ట్ కలెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 45 మంది పౌరులు పేర్లు నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకుని తమ వద్ద ఉన్న పాత, దెబ్బతిన్న లేదా ఉపయోగంలో లేని దేవుళ్ల ఫోటోలు, విగ్రహాలను అధికారులకు అందజేశారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం సుమారు అర టన్ను (0.5 టన్నులు) డివైన్ వ్యర్థాలను సేకరించారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు తగిన గౌరవం ఇస్తూనే పాత, దెబ్బతిన్న దేవతా చిత్రాలు, ఫోటో ఫ్రేములు, విగ్రహాలు తదితరాలను అధికారులు గౌరవప్రదంగా సేకరించారు. అనంతరం పండితులతో శాస్త్రోక్తంగా ఉద్వాసన పూజ నిర్వహించారు. ఆ తర్వాత సేకరించిన సామాగ్రిని గాజు, ఫ్రేములు, ఫోటోలు, పుస్తకాలు మరియు విగ్రహాలుగా విడివిడిగా వేరు చేసి పునర్వినియోగం (రీసైక్లింగ్) కోసం పంపేందుకు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న పౌరుల నుంచి అభిప్రాయాలను (ఫీడ్‌బ్యాక్) సేకరించి, వారి సూచనలను నమోదు చేసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం ద్వారా ప్రజల్లో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, రీసైక్లింగ్ మరియు దైవిక వస్తువుల గౌరవప్రదమైన నిర్వహణపై అవగాహన మరింత పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ యు. వెంకట్రాములు, సీఎమ్‌సీ స్వచ్ఛ భారత్ మిషన్ డీవైఈఈ (ఎస్‌డబ్ల్యూఎమ్) నిఖిల్ రెడ్డి, ఏఈ స్వాతి మరియు గాజులరామారం సర్కిల్ పారిశుధ్య (సానిటేషన్) సిబ్బంది పాల్గొన్నారు.

రాగం సుజాత నాగేందర్ యాదవ్ సేవలు చిరస్మనీయం

-సిపిఐ నాయకులు వీర్ల ప్రకాష్ రావు, కార్పొరేటర్లు సపన్దేవ్, మెట్టు కుమార్ యాదవ్ ల ఘన నివాళి

హైదరాబాద్, ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ చైర్ పర్సన్ దివంగత రాగం సుజాత నాగేందర్ యాదవ్ కు ఘన రాష్ట్ర సిపిఐ ప్రముఖ నాయకులు వీర్ల ప్రకాష్ రావు, మాజీ కార్పొరేటర్లు సఫాన్ దేవ్, మెట్టు కుమార్ యాదవ్ లు నల్లగండ్ల లోని ఆమె స్వగృహంలో జరిగిన దశదినకర్మలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీర్ల ప్రకాష్ రావు మాట్లాడుతూ మహిళా సాధికారత, పేదలు, బడుగు బలహీన వర్గాల, మహిళా సంక్షేమం కోసం కృషి చేసిన సుజాత యాదవ్ సేవలు చిరస్మనీయమన్నారు. వారి మృతి కుటుంబానికే కాక సమాజానికి తీరనిలోటని, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. తమ మిత్రుడు, మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్,వారి కుమారులు రాగం అనిరుధ్ యాదవ్,రాగం అభిషేక్ యాదవ్ లను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, గోకుల్ సేవా సమితి అధ్యక్షులు జొన్నలగడ్డ బసవరాజు, నాయకులు డొక్కు శ్రీనివాస్ యాదవ్, వీర్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టిఆర్ఎస్ మదీనాగూడ డివిజన్ అధ్యక్షునిగా కొల్లూరు కుమార్ కురుమ

శేరిలింగంపల్లి,ఆగస్టు 22 (వార్తాప్రభ):తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) మదీనాగూడ డివిజన్ అధ్యక్షుడిగా కొల్లూరు కుమార్ కురుమ నియమితులయ్యారు.శనివారం శేరిలింగంపల్లి

నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆయనకు నియామక పత్రాన్ని అధికారికంగా అందజేశారు.మదీనాగూడ ప్రాంతానికి చెందిన కుమార్ కురుమ కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కార్యకర్తలను సమన్వయం చేస్తున్నారని నాయకులు తెలిపారు.పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆశయాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ.. కుమార్ కురుమ నియామకంతో మదీనాగూడ డివిజన్‌లో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు.

సర్ నోటీసులకు కంగారుపడొద్దు..

- అత్యంత పారదర్శక విచారణతో పరిష్కారం
- ఓటుహక్కు పరిరక్షణ కోసమే సమగ్ర ప్రక్రియ
- దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనలో ప్రతిఒక్కరూ భాగస్వాములుకండి
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, ఆగష్టు 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా జారీచేస్తున్న నోటీసులపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి నోటీసుకు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, విచారించి, అర్హత ఉన్న ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ సమావేశం నిర్వహించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నోటీసు రావడం అంటే ఓటు హక్కు తొలగించినట్లు కాదని.. నోటీసు అందుకున్న వారు నిర్ణీత గడువులోగా తమ వద్ద ఉన్న ఆధారాలు, సంబంధిత పత్రాలను సమర్పించి తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చన్నారు. ప్రతి కేసును నిష్పక్షపాతంగా పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈఆర్‌వో స్థాయిలోనూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సందేహాలను నివృత్తి చేయడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాను దోష రహితంగా, కచ్చితత్వంతో రూపొందించడమే లక్ష్యంగా జరుగుతున్న ప్రక్రియలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఇప్పటివరకు 1,85,718 నోటీసుల పంపిణీ జరిగిందని.. వీటిలో 32,996 మందికి విచారణ నిర్వహించడం జరిగిందన్నారు. 69,717 మందికి విచారణ షెడ్యూలు గడువు ముగియగా విచారణ కోసం రీషెడ్యూల్ చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 22వ తేదీతో పాటు పాటు 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎవరికి ఏ సందేహమున్నా క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు సహాయసహకారాలకు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కొత్తగా ఓటు నమోదుకు వీలుకల్పించే ఫారం-6తో పాటు ఫారం-7, ఫారం-8లు కూడా వారి వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని.. అర్హులైన ప్రతిఒక్కరూ కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు ను చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహంతో పాటు వై.రామయ్య (తెదేపా), పి.గోవింద (భాజపా), టి.హరికృష్ణ (ఏఏపీ), బి.మురళీకృష్ణ (ఐఎన్‌సీ), డీ

జనసేన నాయకులు వేమూరి త్రినాథ్ ఆధ్వర్యంలో మెగా బైక్ ర్యాలీ

గుడివాడ,ఆగష్టు 22 (వార్తాప్రభ) : మెగాస్టార్ కొణిదెల చిరంజీవి జన్మదినోత్సవ వేడుకలు జనసేన నాయకులు జనసేన సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు వేమూరి త్రినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం గుడివాడ శరత్ థియేటర్ వద్ద భారీ ర్యాలీ ప్రారంభమై, నాగవరప్పాడు మీదుగా ఉత్సాహభరిత వాతావరణంలో నెహ్రూ చౌక్ వరకు కొనసాగింది. అనంతరం నెహ్రూ చౌక్ సెంటర్‌లో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమూరి త్రినాథ్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి సినీ ప్రస్థానం, ఆయన వ్యక్తిత్వం, సేవా కార్యక్రమాలు మరియు కోట్లాది మంది అభిమానులపై ఆయన చూపిన ప్రభావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పంచకర్ల అమర్, వీ.వీ.ఖ, గోకరకొండ బలరాం, కోన కేశవ, గుండు వెంకట్రావు, కోసూరి ఆంజనేయులు, పడాల పూర్ణ, గునుకుల వినోద్, ఇమ్మిడిశెట్టి భాను, బెల్లివాడ పవన్, నిల్లా సాయి కృష్ణ, నాగవరప్పడు చందు, సుమంత్, వంగలపూడి రాము, శీతాల రామకృష్ణ, వాస నవీన్, కందికొండ దుర్గా, నాగయ్య, కొండ మధు కుమార్, గన్నిస్ యూత్ మరియు వీరమహిళలు పడాల సౌమ్య, శీతాల సుభాషిణి, కూనపరెడ్డి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మానవత గుడివాడ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ & బిస్కెట్స్ పంపిణీ

గుడివాడ,ఆగష్టు 22 (వార్తాప్రభ) : మానవతా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం గవర్నమెంట్ హాస్పటల్ లో డాక్టర్ జయప్రద చే కేక్ కట్ చేయించి, ఇన్ పేషంట్స్ కు పండ్లు, బిస్కట్స్, బ్రెడ్ లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మానవతా ఆవిర్భావ దినోత్సవం గురించి మానవతా పెద్దలందరు ప్రసంగిస్తూ.. మానవతా సేవల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరి రావు, పర్యావరణ పరిరక్షణ చైర్మన్ దండమూడి జయలక్ష్మి, గుడివాడ మానవ తాశాఖ అధ్యక్షురాలు నందమూరి పద్మజ, ఉపాధ్యక్షులు ఘంటసాల రామకృష్ణ, కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, కార్యవర్గసభ్యులు మరడాని వెంకటేశ్వరరావు, వెంకట రమణ, కోన రామారావు, డైరెక్టర్ కొమ్ము వెంకటేశ్వర్లు, మానవత గుడివాడ మాజీ అధ్యక్షుడు, డైరెక్టర్ దండమూడి సీతారామ స్వామి, తిరుమల గుప్తా, నాగేశ్వరరావు లు పాల్గొన్నారు.

మానవతా కలిదిండి ఆధ్వర్యంలో ఘనంగా శాంతి ర్యాలీ..

కలిదిండి,ఆగష్టు 22 (వార్తాప్రభ) : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వారోత్సవాలలో భాగంగా కలిదిండి మానవతా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో పాల్గొని శాంతి సందేశాన్ని చాటారు. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణజిల్లా కార్యవర్గ సభ్యులు నూకల శ్యామలరావు గుప్తా మాట్లాడుతూ సమాజ సేవలో మానవతా సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని, ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అధ్యక్షులు పోకల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సంస్థ ద్వారా నిరంతరం నిరుపేదలకు, ఆపన్నులకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. చైర్మన్ పేటేటి వివేకానంద గురుస్వామి మాట్లాడుతూ శాంతి, సేవా గుణాలే సమాజ ప్రగతికి మూలస్తంభాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోదావరి సత్యనారాయణ, డైరెక్టర్ మారుబోయిన రత్నారావు, ఉపాధ్యక్షులు కలిదిండి ఆంజనేయులు, ట్రెజరర్ పత్తి శ్రీనివాసరావు, కార్యదర్శి వడుపు రమేష్, కార్యవర్గ సభ్యులు శివ వెంకట ప్రసాద్, వాకాని నాగ సుబ్రహ్మణ్యం, పండు, జాన్ రాజు, డైరెక్టర్లు నూకల శ్యామల రావు గుప్తా, తిరుమలశెట్టి రాంబాబు, మావులూరి బాబురావు, గంధం వెంకటేశ్వరరావు, చేబత్తిన వినోద్ మరియు ప్రముఖ వైద్యులు ఎర్ర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ జనసేన పార్టీ వీరమహిళ పడాల సౌమ్య పుట్టినరోజు సందర్భంగా జనసేన నాయకులు మరియు జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కమిటీ మెంబర్ వేమూరి త్రినాథ్ ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ సెంటర్ లో కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో జనసేన నాయకులు పంచకర్ల అమర్, వీ.వీ.ఖ, గోకరకొండ బలరాం, కోన కేశవ, గుండు వెంకట్రావు, కోసూరి ఆంజనేయులు, పడాల పూర్ణ, గునుకుల వినోద్, ఇమ్మిడిశెట్టి భాను, బెల్లివాడ పవన్, నిల్లా సాయి కృష్ణ, నాగవరప్పడు చందు, సుమంత్, వంగలపూడి రాము, శీతాల రామకృష్ణ, వాస నవీన్, కందికొండ దుర్గా, కొండ మధు కుమార్, గన్నిస్ యూత్ మరియు వీరమహిళలు శీతాల సుభాషిణి, కూనపరెడ్డి పద్మ లు సౌమ్య కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

గుడివాడ,ఆగష్టు 22 (వార్తాప్రభ) :

పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి..

గుడివాడ, వెంటప్రగడ మరియు ఆడ్డాడ పాఠశాలల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు..

గుడివాడ,ఆగష్టు 22 (వార్తాప్రభ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ వారీ ఉత్తర్వుల ప్రకారం శనివారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ యస్. వాసుదేవ్ గారు ఆదిత్య డిగ్రీ కాలేజీ (గుడివాడ) నందు పోక్సో యాక్ట్ మీద ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు మరియు పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ కొలుసు శ్రీనివాసరావు లు పాల్గొన్నారు. అలాగే పెద పారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామం జడ్.పి. హై స్కూల్ నందు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ పి. గాయత్రి గారు పోక్సో యాక్ట్ మీద న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు మరియు పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పెదపారుపూడి సుభాషిణీ తదితరులు పాల్గొన్నారు. అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి. అరుంధతి గారు పామర్రు మండల పరిధిలోని అడ్డాడ గ్రామం విజ్ఞాన విహార స్కూల్‌లో పోక్సో యాక్ట్ మీద న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు మరియు పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు. పైన జరిగిన కార్యక్రమాల్లో న్యాయమూర్తులు వాసుదేవ్, గాయత్రి, అరుంధతి లు మాట్లాడుతూ పోక్స్ యాక్టు మీద అవగాహన కల్పించి, విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే మండల న్యాయ సేవాధికార కమిటీ వారీని సంప్రదించాలని అన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 15100 కి ఫోను చేసి న్యాయ సలహాలు పొందవచ్చని పేర్కొన్నారు.

గుడివాడ జనసేన కార్యాలయంలో మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు

గుడివాడ,ఆగష్టు 22 (వార్తాప్రభ) : స్థానిక సత్యనారాయణపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు గుడివాడ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్, సుంకర వెంకట్ ల నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో బూరగడ్డ శ్రీకాంత్ చిరంజీవి జన్మదిన కేక్‌ను కట్ చేసారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం "జై చిరంజీవి.. జిందాబాద్ మెగాస్టార్" నినాదాలతో మారుమోగింది. బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి.. తన కష్టంతో, పట్టుదలతో అంచెలంచెలుగా ఎదిగి కోట్లాది మంది అభిమానుల ఆరాధ్యదైవంగా నిలిచారనీ కొనియాడారు. రక్తదానం, నేత్రదానం వంటి కార్యక్రమాల ద్వారా ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపారనీ, అందుకే చిరంజీవిని అభిమానులు ఒక నటుడిగా మాత్రమే కాకుండ, సేవామూర్తిగా కూడా గౌరవిస్తారనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రూరల్ మండల అధ్యక్షుడు ఇంటూరి గజేంద్ర, పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, నాయకులు షేక్ నాగూర్ భాష, దాసరి మహేష్, సీతారాం, కొట్టే శివ, షేక్ మీరా షరీఫ్, లోయ రాజా, సుధా బత్తుల వెంకటేష్, ఏడుకొండలు, అక్కల నరేష్, గేదెల గణేష్, జాజుల సురేష్, గోవిందరాజులు, సిహెచ్ రాజా, గుండా ఉమా మహేష్, వీర మహిళలు జి కళ్యాణి, కనకదుర్గ, శిరీష, కల్పన, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు సినీ రంగంలో ఆదర్శనీయమైన వ్యక్తి చిరంజీవి

● పద్మ విభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలలో మాజీ మంత్రి కొడాలి నాని..

గుడివాడ,ఆగష్టు 22 (వార్తాప్రభ) : చిరంజీవి అభిమాని తోట సాయి ఆధ్వర్యంలో పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అతిథిగా పాల్గొని అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు, నేడు కూడా సినీ రంగంలో ఎందరికో చిరంజీవి గారు ఆదర్శప్రాయమైన వ్యక్తి అని కొడాలి నాని కొనియాడారు. ఆయన పడిన కష్టం, సాధించిన విజయాలు ఎంతోమందికి స్ఫూర్తినిచ్చాయని తెలిపారు. ఎందరికో స్ఫూర్తినిచ్చే మెగాస్టార్ చిరంజీవి మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెరుగుమాల కాళీ, నగుళ్ల సత్యనారాయణ, మొండ్రు వెంకటేశ్వరరావు, ఆడప పండు, లోయ రాజేష్, మహమ్మద్ ఖాసిం (అబు), ఫర్నిచర్ పార్క్ బెన్ను, సింహాద్రి రాంబాబు, ఎస్ కే బాజీ, గంట శీను, కొంకితల ఆంజనేయ ప్రసాద్, గంటా సురేష్, చుండూరి శేఖర్, తోట శివాజీ, జ్యోతుల మణికంఠ, రేమల్లె నీలకాంత్, గిరి బాబాయ్, తోట సాయి, ధనాల ఫణి, క్రేను బాబి, గుదే రవి, గోళ్ళ సోమేశ్వరరావు, అద్దేపల్లి పురుషోత్తం, అద్దేపల్లి హరి, తోట సాయి, అడపా హర్ష, నీరుడు ప్రసాద్, ఖాజా, కర్రె నాని, జోషి, సాయన దుర్గాప్రసాద్, కలపాల కిరణ్, పిన్నమనేని రాఘవేంద్రరావు, రమీజా, కళావతి, శేషం నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఎండపల్లి మునిపెడ గ్రామాలలో డోర్ టు డోర్ కార్యక్రమం...

పాల్గొన్న కూటమి నాయకులు...

కృత్తివెన్ను,ఆగష్టు 22 (వార్తాప్రభ) : కృత్తివెన్ను మండలం యూనిట్ 32 లో శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశానుసారం కృత్తివెన్ను మండలం లో శనివారం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న "కూటమి ప్రభుత్వం 2 ఏళ్ల అభివృద్ధి--సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా , యూనిట్ 32 లో బూత్ నెం 171,172,196,లో యండపల్లి,మునిపెడ, గ్రామాల్లో ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి--సంక్షేమ ఫలాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు వాస్తవాలను వివరించడమే ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిన్నెంటి రత్తయ్య,దాసరి ఆదినారాయణ,కాకర ఇజ్రాయెల్ ,పాలపర్తి రాజేష్,గుమ్మళ్ళ రఘు,దాసరి శ్రీను,పుప్పాల నరసింహారావు,బత్తుల పూర్ణ,పిన్నెంటి గంగరాజు,పిన్నెంటి గణేష్,కొప్పర్తి శ్రీరామూర్తి,ఈమన రాంబాబు,ఈమన చిన్నా,పిన్నెంటి శ్రీను,పిన్నెంటి బాబి,రాంబాబు,దాసరి మురళి,తోట జయబాబు,గంటా బాలమురళీకృష్ణ ,గంటా రాంబాబు,జన్యావుల నాగబాబు,కన్నా అంజి,కొప్పర్తి ధర్మారావు,పిన్నెంటి వాసు,జన్యావుల శ్రీను,సూదాబత్తుల మారుతి,జన్యావుల చిన్నా,పిన్నెంటి హరి,సుంకర దినేష్,వీరవల్లి మహేష్,పాలపర్తి తాతాజి,బూసి ఏసుపాదం,పాశం సుబ్బారావు, మరియు కూటమి కర్యకర్తలు గ్రామ-స్తులు మహిళలు,యువకులు అధికసంఖ్యలో పాల్గొని కూటమి ప్రభుత్వం రెండేళ్ల అభివృద్ధి--సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ చేరవేసేలా కూటమి శ్రేణులు విస్తృతంగా ఇంటింటికి ప్రచారం కొనసాగిస్తున్నామని నాయకులు తెలిపారు.

అగ్ని బాధిత కుటుంబాన్ని ఆదుకున్న ఆర్‌కే వారియర్స్

గుడివాడ,ఆగష్టు 22 (వార్తాప్రభ) : వలివర్తిపాడు గ్రామంలో సాలె నాంచారమ్మ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా కాలిపోయి కట్టుబట్టలతో ప్రాణాలతో బయటపడిన వృద్ధతల్లి, ఈ విషయం తెలుసుకున్న గుడివాడ పట్టణ ఆర్కే వారియర్స్ ఆ వృద్ధ తల్లిని పరామర్శించి, బియ్యం, నిత్యవసర సరుకులు, నగదు అందజేసి మేమున్నాము అని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గుడివాడ పట్టణ బిజెపి అధ్యక్షులు డాక్టర్ మాచర్ల రామకృష్ణ (ఆర్‌కే) మాట్లాడుతూ సమాజమే దేవాలయంగా భావిస్తూ, మానవ సేవ అనే నినాదంతో గుడివాడ పట్టణంలో మేము చేస్తున్న సేవా కార్యక్రమాలు భాగంగా, వలివర్తిపాడు గ్రామంలో ఇల్లు కాలిపోయి రోడ్డును పడ్డ వృద్ధ తల్లికి మా వంతు సహాయం చేసి ఆ తల్లికి మేమున్నామని బరాస ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ సహాయ కార్యక్రమానికి విచ్చేసిన బిజెపి సీనియర్ నాయకులు లింగం చిట్టిబాబు చేతుల మీదుగా నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో లంక రాంబాబు, గాదె చరణ్, నాని, బాబీ, ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు.

అభివృద్ధి కి చిహ్నం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

గుడివాడ,ఆగష్టు 22 (వార్తాప్రభ) : అభివృద్ధికి చిహ్నం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమమని ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సమాజం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా॥ డేవిడ్ ట్విన్ సన్ అన్నారు. స్థానిక 13వ వార్డు బాపూజీ నగర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమందు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో డా॥ డేవిడ్ ట్విన్ సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్ర ఎ.ఎన్.ఎమ్. లు, ఆశ కార్యకర్తలు, శానిటేషన్ సిబ్బంది ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రం చేసారు. అనంతరం పరిశుభ్రత కొరకు ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో సి.వో. వి రామారావు, ఎ.ఎన్.ఎమ్ లు, ఆశ కార్యకర్తలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీనగరంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

కృత్తివెన్ను,ఆగష్టు 22 (వార్తాప్రభ) : ఎండపల్లి గ్రామపంచాయతీ గాంధీనగరం గ్రామంలో శనివారం నాడు మెగాస్టార్, పద్మభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలు అభిమానుల సమక్షంలో వైభవంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య మరియు గ్రామస్తుల సమక్షంలో కేకులు కట్ చేసి స్వీట్లు, మిఠాయిలు పంచుకున్నారు. సినీ నటుడు గానే కాకుండా రాజకీయ రంగంలో సైతం తనదైన ముద్ర వేసిన చిరంజీవి ఘనత గురించి, ప్రజలకు ఆయన చేసిన సేవా కార్యక్రమాల గురించి తెలియచేశారు ఈ కార్యక్రమం లో పిన్నెంటి ముత్యాల రావు,దాసరి శ్రీను బత్తుల పూర్ణ కొప్రర్తి శ్రీరామమూర్తి పిన్నెంటిహరి,ప్రత్తి రాము పిన్నెంటి గణేష్ పిన్నెంటి నాగ ప్రసాద్ జన్యావుల నాగబాబు పిన్నెంటి బాబి పిన్నెంటి శ్రీను. ఈమన రాంబాబు మరియు చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశిస్తే ఎంపీపీ గా పోటీ చేస్తా...

-జనసేన మండల అధ్యక్షుడు ఊసా వెంకయ్య

పెడన,ఆగష్టు 22 (వార్తాప్రభ) : పార్టీ ఆదేశిస్తే ఎంపీపీ గా పోటీ చేస్తానని పెడన మండల జనసేన అధ్యక్షుడు ఊసా వెంకయ్య చెప్పారు. నియోజకవర్గం లో నాలుగు మండలాలు ఉన్నాయి. పెడన మండలాన్ని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిస్తే ప్రత్యక్ష ఎన్నికలో బరిలో ఉం టానని శనివారం నాడు వార్తప్రభ ప్రతినిధి తో మాట్లాడుతూ అన్నారు. ప్రస్తుతం ఆయన పెనుమల్లి బ్యాంక్ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తు న్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కూడా వెంకయ్య తన వంతు సేవలు అందిస్తూ వచ్చారు. వైసీపీ అధికారంలో ఉన్నపుడు జనసేన జెండా పట్టుకోవడానికి కూడా వెనుకాడుతున్న రోజుల్లోనే బైక్ కు పెద్ద జెండా కట్టుకుని ఎక్కడ మీటింగ్ జరిగితే అక్కడకు దూర ప్రాంతాలకు సైతం వెళ్లిన ధైర్య శాలి వెంకయ్య. మరి పార్టీ ఏం చేస్తుందో చూడాలి. పొత్తులో భాగంగా ఏ మండలాన్ని జనసేనకు ఇస్తారో..,..

గురుకులాల మూసివేతతో 2 వేల మంది విద్యార్థులకు ఇబ్బందులు

అమలాపురం,ఆగష్టు 22 (వార్తాప్రభ) : రాష్ట్రంలోని మేఘాద్రిగడ్డ, తాడికొండ, కోట గురుకుల పాఠశాలలను అర్ధాంతరంగా మూసివేసి వాటి స్థానంలో ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని అంబేద్కర్ మిషన్ ఇండియా తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నిర్ణయం వల్ల సుమారు 2,000 మంది విద్యార్థుల విద్యకు అంతరాయం ఏర్పడటంతో పాటు, ఇతర గురుకుల పాఠశాలలపై మౌలిక వసతుల భారం పెరిగిందని సంస్థ అధినేత పి.వి. సునీల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురంలోని అంబేద్కర్ మిషన్ ఇండియా జోనల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట గురుకుల పాఠశాల మూసివేతతో 600 మందికి పైగా విద్యార్థులు ఇతర పాఠశాలలకు తరలించబడ్డారని తెలిపారు. వాకాడు తదితర గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో తరగతి గదులు, వసతి గృహాలు, మ-రుగుదొడ్లపై తీవ్ర ఒత్తిడి ఏర్పడిందన్నారు. ఒక్కో తరగతి గదిలో సుమారు 100 మంది, ఒక్కో మరుగుదొడ్డిని 60 మంది వరకు ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. విద్యార్థులు పడుకునేందుకు కూడా తగినంత స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కోట గురుకుల పాఠశాల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించిన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయడంతో పాటు, సమస్యను పరిశీలిస్తానని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. తాడికొండలో సుమారు 600 మంది, మేఘాద్రిగడ్డలో సుమారు 700 మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సునీల్ కుమార్ పేర్కొన్నారు. తాడికొండ ఎమ్మెల్యే డా. తెనాలి శ్రావణ్‌కుమార్, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ ఈ సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ప్రజలు ఎమ్మెల్యేలను ఎన్నుకున్నది ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరించేందుకేనని, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం మాత్రమే వారి బాధ్యత కాదని అన్నారు. ప్రజలకు లభించిన అధికారాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగించాలని సూచించారు. ఎక్సలెన్సీ సెంటర్లకు వ్యతిరేకం కాదు ఎక్సలెన్సీ సెంటర్ల ఏర్పాటు నిర్ణయానికి తాము వ్యతిరేకం కాదని సునీల్ కుమార్ స్పష్టం చేశారు. అయితే వాటి కోసం ఇప్పటికే కొనసాగుతున్న గురుకుల పాఠశాలలు, హాస్టళ్లను మూసివేయడం సరికాదన్నారు. అవసరమైతే అద్దె భవనాలు లేదా ఇతర ప్రభుత్వ భవనాల్లో ఎక్సలెన్సీ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసనలు చేపడుతున్న సమయంలో పోలీసులు జోక్యం చేసుకోవడాన్ని సునీల్ కుమార్ తప్పుబట్టారు. మూసివేసిన పాఠశాలలకు పోలీసులు వెళ్లి గేట్లకు తాళాలు వేయించడం, నిరసనలను అడ్డుకోవడం పోలీసుల విధుల్లో భాగం కాదని వ్యాఖ్యానించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి నేరానికి పాల్పడకుండా తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన చేస్తున్నారని, అలాంటి సందర్భాల్లో పోలీసుల జోక్యం ఎందుకని ప్రశ్నించారు. పోలీసులు తమ పరిధిలోని బాధ్యతలపై దృష్టి సారించాలని సూచించారు. గురుకుల పాఠశాలల మూసివేతతో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమవుతున్నప్పటికీ సమస్యకు తగినంత ప్రచారం లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలల ఎదుట ఆందోళనలు చేస్తున్న అంశాన్ని వార్తాపత్రికలు, టెలివిజన్ ఛానళ్లు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. తాడికొండ, మేఘాద్రిగడ్డ, కోట గురుకుల పాఠశాలలను యథాతథంగా కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఎమ్మెల్యేలు మ-ఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకుని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే వచ్చే ఎన్నికల్లో ఆయా ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా ప్రచారం చేయాల్సి వస్తుందని అంబేద్కర్ మిషన్ ఇండియా తరఫున హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే గురుకుల పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని పి.వి. సునీల్ కుమార్ డిమాండ్ చేశారు.

పెడన మున్సిపల్ తొలి చైర్ పర్సన్ యర్రా నాగ భ్రమరాంబ..

అవకాశం వస్తే రాజకీయాల్లోకి మళ్ళీ వస్తా

పెడన,ఆగష్టు 22 (వార్తాప్రభ) : త్వరలోమున్సిపల్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఒక్కసారి గతాన్ని మననం చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. జిల్లాలో మేజర్ పంచాయతీగా ఉన్న పెడన తొలిసారిగా 1985 లో మున్సిపాలిటీ గా ఏర్పడింది. 1987 వ సంవత్సరంలో జరిగిన తొలి ప్రత్యక్ష ఎన్నికల్లో యర్రా నాగ భ్రమరాంబ చైర్పర్సన్ గా ఎన్నికయ్యారు. టీడీపీ నుంచి సుమారు 16వందల ఓట్ల మెజార్టీతో ఆమె సమీపకాంగ్రెస్ పార్టీ కి చెందిన ప్రత్యర్థి మెట్ల నాగ మల్లేశ్వరిపై గెలుపొందారు.సిపిఐ నుంచి మెట్ల జగదాంబ ఇండిపెండెంట్ గా ఏనుగుల జయలక్ష్మి మూడవ అభ్యర్థిగా బరిలో వున్నారు. గ్రాడ్యుయేట్ చేసిన భ్రమరాంబ తన దైన శైలిలో పనిచేసి ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు పొందారు. ఆమె అప్పట్లో జిల్లాటీడీపీ లో చక్రం తిప్పుతున్న దేవినేని నెహ్రూ అనుచరురాలుగా గుర్తింపు పొందారు. నెహ్రూ తో పాటే ఎన్ టీ ఆర్ టీడీపీ (ఎల్ పి వర్గం)లో చేరారు. ఈమెకు కౌన్సిల్ లో స్వపక్షం లోనే విపక్షం ఉండేది. అయినప్పటికీ ఎవరిని లెక్క చేయకుండా ముందుకు సాగి ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈమె కాంగ్రెస్ లో కూడా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం పెడన లోనే నివాసం ఉంటూ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వార్తా ప్రభ ప్రతినిధి భ్రమరాంబను పలకరించడం జరిగింది. ప్రకాశం అంటూ వస్తే తాను మరోసారి రాజకీయాలలోకి ప్రవేశించే ఉద్దేశం ఉందని అన్నారు. ఇలా ఉండగా ఈ కౌన్సిల్ లో సమతం మల్లికార్జునుడు అనే కౌన్సిలర్ వైస్ చైర్మన్ గా పనిచేస్తూ అకాల మరణం పొందారు.అనంతరం ఈ పదవి కోసం ఉప ఎన్నిక అనివార్యమైంది .కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్ గా గెలిచిన దాదా కొన్ని కారణాలవల్ల టీడీపీ మద్దతుతో వైస్ చైర్మన్ గా పోటీ చేశారు. ఉక వివాదంలో దాదా కాంగ్రెస్ ను వీడి టీడీపీ కి దగ్గరయ్యారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ నుంచి దాదాను సస్పెండ్ చేసారు. దీంతో కాంగ్రెస్ నుంచి అత్తావుర్ రెహ్మాన్ (కమాల్) వీసీ గా బరిలో నిలిచారు. కౌన్సిల్లో బలబలాలు సమానంగా ఉండటంతో ఎక్స్ ఆఫీషియో ఓట్లపై ఇరు పార్టీలు కూడా ఆధారపడ్డాయి. అప్పటి శాసనసభ్యుడు అంబటి బ్రాహ్మణయ్య పార్లమెంటు సభ్యులు కావూరి సాంబశివరావు ఈ కౌన్సిల్ లో ఓటర్లుగా నమోదు అయి వున్నారు. అండమాన్ లో ఉన్న కావూరి ని ఓటు వేయడం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా రప్పించింది.వీరిద్దరి ఓట్లతో ఫలితం డ్రా అయింది. అనంతరం జరిగిన లాటరీ పద్ధతిలో కమాల్ వైస్ చైర్మన్ గా గెలుపొందారు.

సాయి కల్యాణి మోటార్స్‌కు 20 వసంతాలు

వాహనదారులకు రెండు దశాబ్దాలుగా నమ్మకమైన సేవలు

హనుమాన్ జంక్షన్,ఆగష్టు 22 (వార్తాప్రభ) : హనుమాన్ జంక్షన్‌లోని సాయి కళ్యాణి మోటార్స్ 20వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. రెండు దశాబ్దాలుగా వాహనదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందుతున్న సాయి కళ్యాణి మోటార్స్ వార్షికోత్సవం సందర్భంగా షోరూమ్‌లో సందడి నెలకొంది. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ నేషనల్ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై హీరో షోరూమ్ అధినేత మూల్పూరి సురేంద్ర కుమార్‌ను అభినందించారు. అనంతరం కేక్ కట్ చేసి షోరూమ్ యాజమాన్యానికి, సిబ్బందికి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుట్టగుంట సతీష్ కుమార్ మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా వాహనదారులకు నమ్మకమైన సేవలు అందిస్తూ సాయి కళ్యాణి మోటార్స్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుందని అన్నారు. వినియోగదారుల నమ్మకాన్ని మరింతగా నిలబెట్టుకుంటూ భవిష్యత్తులో సంస్థ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. యాజమాన్యం, సిబ్బంది సమష్టి కృషితో సంస్థ మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. షోరూమ్ అధినేత మూల్పూరి సురేంద్ర కుమార్ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా తమపై నమ్మకం ఉంచి ఆదరిస్తున్న వాహనదారులు, వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి, శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ నాయకులు నందిగం స్వామి, మత్తి సాంబశివరావు, తాడి రంగారావు, అక్కినేని రాఘవేంద్రరావు, యలమంచిలి శ్రీరామచంద్ర మూర్తి, వేగిరెడ్డి నాని, అక్కినేని శ్రీనివాస ఫణీంద్ర, కాకుల శ్రీనివాసరావు, మాలిన కృష్ణ, నక్కా లాల్ బహుదూర్ శాస్త్రి, లయన్ పుట్టా శివాజీ, కొండపావులూరి రామమోహనరావు, సేల్స్ మేనేజర్ యజ్జవరపు ఆనంద్ కుమార్, షోరూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ రెడ్‌బుక్‌తో భారత రాజ్యాంగానికి చేటు...

- అమరావతి ఒక మాయాజాలం...అదొక జురాసిక్ పార్క్...
- సెల్‌ఫోన్ చంద్రబాబే కనిపెట్టినట్లుగా భావన...
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర మాజీ లీగల్ సెల్ కన్వీనర్ చిత్తర్వు వెల్లడి...

గుడ్లవల్లేరు,ఆగష్టు 22 (వార్తాప్రభ) : రెడ్‌బుక్ పేరిట ఏపీ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ భారత రాజ్యాంగానికి చేటు తీసుకొస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మాజీ లీగల్ సెల్ కన్వీనర్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు అన్నారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం అంగలూరులోని మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ డైరెక్టర్ మెరుగుమాల బాలు నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రకారం చట్టాన్ని తమ చేతిలోకి తీసుకునే హక్కు ఏ పాలకులకు లేదని చిత్తర్వు చెప్పారు. ప్రతిపక్షంలోని వైఎస్సార్ సీపీ నాయకులను తామే శిక్షిస్తామన్నట్లుగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని లోకేష్ ఏపీలో నడపటం వలన సమాజంలో ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాత్రింబవళ్లు నిద్రాహారాలు లేకుండా కష్టించి రచించిన భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచినట్లుగా రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట లోకేష్‌తో పాటు తన అనూయులు చట్టాన్ని తమ చేతిలోకి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రెడ్‌బుక్ రాజ్యాంగానికి స్వస్తి చెప్పకపోతే ప్రజలే రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. అమరావతి అనేది సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రకటనలు వలె ఒక మాయాజాలంగా మారిందని చిత్తర్వు అన్నారు. అమరావతిలో రాజధాని నిర్మాణం అనేది ఊహల్లోనే తప్ప... ఆ ప్రాంతంలో నిర్మాణాలు జరగటం ప్రశ్నార్థకమేనని చెప్పారు. కొద్దిగా వర్షం కురిస్తేనే...మునకకు గురయ్యే అమరావతి ప్రాంతంలో జంతువులు తిరుగుతాయన్నారు. ఆ ప్రాంతాన్ని చిన్నపాటి జురాసిక్ పార్క్‌గా ఆయన అభివర్ణించారు. రూ.లక్ష కోట్లతో చంద్రబాబు తన జీవితాంతం నిర్మించినా...రాజధాని పూర్తి అవ్వటం అసాధ్యమన్నారు. ఎందరో మహానుభావులు అభివద్ధి చేసిన హైదరాబాదును తానే అభివద్ధి చేసినట్లుగా చంద్రబాబు చెప్పుకోవటం పరిపాటిగా మారిందన్నారు. అవసరమైతే సెల్‌ఫోన్ కూడా తానే కనిపెట్టినట్లుగా బాబు భావిస్తారన్నారు. ఇటీవల ప్రారంభమైన భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మో హన్‌రెడ్డి నిర్మిస్తే...అదేదో తన గొప్పగా బాబు చెప్పుకున్నారని గుర్తు చేశారు. అదే పద్ధతిలో ఎవరో చేసిన ప్రతి పనిని తన ఖాతాలో వేసుకోవటం బాబుకు అలవాటేనని చిత్తర్వు పేర్కొన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

- శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి, డాక్టర్ డి ఆర్ కె ప్రసాద్..
- రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం
- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

కోడూరు,ఆగష్టు 22 (వార్తాప్రభ) : రక్తదానం చేసినవారు ప్రాణదాతలతో సమానమని అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. శనివారం నాడు కోడూరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య ప్రార్థన మందిరం నందు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు ఈ శిబిరాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, స్వచ్ఛ చల్లపల్లి రథసారథి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ డి ఆర్ కె ప్రసాద్ ప్రారంభించారు. ముందుగా ఇరువురు ఆహ్వానితులకు రెట్రా సొసైటీ కోడూరు మండల అధ్యక్షులు జరుగు పోతు రాజు మొక్కలను అందించిస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేసిన దాతలను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అభినందించారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, రక్త దానం చేసిన ప్రతి ఒక్కరిని మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నట్లు. ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవన బోయ-ఎన వెంకటేశ్వరరావు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్, సొసైటీ కోడూరు అధ్యక్షులు జరుగు పోతురాజు, ఉపాధ్యక్షులు తోట శ్రీనివాసరావు, కోశాధికారి కొండవీటి సురేష్, సభ్యులు జొన్న రవిశంకర్, కోడూర్ ఎస్సై చాణిక్య, కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మరే గంగయ్య, జనసేన జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, గాజుల శంకర్రావు,అవనిగడ్డ రెడ్ క్రాస్ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, అవనిగడ్డ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు,గుడివాక శివరావు, కోట రాంబాబు, పూత బోయన కరుణ్ కుమార్,పూతబోయిన సీతారత్న సాయిబాబు, కోట సుబ్బారావు, బచ్చు వెంకటేష్,జరుగు ఆదినారాయణ, బడే భవనారాయణ, యర్రంశెట్టి దామోదర్ రావు, కాగిత రామారావు , జరుగు లక్ష్మణ, సిద్దినేని అశోక్ నాయుడు, మాచవరపు ఆదినారాయణ, రెడ్రోతు కృష్ణబాబు, చుండూరు శివనాగేశ్వరరావు, గోన వేణుగోపాలరావు, రేపల్లి యోగ ప్రకాష్, వేజెండ్ల శ్రీనివాసరావు, కోట మహిధర్,మోపిదేవి స్వరూప్, కడవకొల్లు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- సమష్టి భాగస్వామ్యమే స్వచ్ఛాంధ్రకు బలమైన పునాది
- ప్రతిఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి
- పరిశుభ్రమైన పరిసరాలతోనే మన ఆరోగ్యకర మైన భవిష్యత్తు
- -స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

జి.కొండూరు,ఆగష్టు 22 (వార్తాప్రభ) : స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,సమష్టి భాగస్వామ్యమే స్వచ్ఛాంధ్రకు బలమైన పునాది అని,స్వచ్ఛతవైపు వేసే ప్రతి అడుగు ఆరోగ్యాంధ్ర కు ముందడుగు అని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు.ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు గ్రామంలోని మండల ప్రజా పరిషత్ కమ్యూనిటీ హాలులో జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో, ఎంపీడీవో బొజ్జగాని శ్రీనివాసరావు నేతృత్వంలో శనివారం మధ్యాహ్నం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మైలవరం ప్రాజెక్ట్, మండల వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు.భారత సుప్రీంకోర్టు ఆదేశాలు-ఘన వ్యర్థాల నిర్వహణ మన బాధ్యత, మన కర్తవ్యం అనే అంశంపై స్థానిక మండల ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా భావించి ఆచరణలో పెట్టినప్పుడే శాశ్వతమైన మార్పు సాధ్యమవు తుందని అన్నారు.మన నుంచి, మన కుటుంబం నుంచి, మన గ్రామం నుంచి స్వచ్ఛతకు సంబంధించిన మంచి అలవాట్లు కొనసాగాలని పేర్కొన్నారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగా నికి దూరంగా ఉంటూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించా లని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, నీరు, వాయు కాలుష్యానికి కారణమవుతున్న నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండటం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు.పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవనానికి పునాది అని, మనం ఈరోజు తీసుకునే చిన్నచిన్న జాగ్రత్తలే రేపటి తరాలకు ఆరోగ్యకరమైన, పర్యావరణహిత భవిష్యత్తును అందిస్తాయని పేర్కొన్నారు.చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు కూడా విజయవంతంగా నడుస్తున్నాయని, మార్పు కోసం ఎదురు చూడకుండా,మార్పును మన నుంచే ప్రారంభిద్దామని అన్నారు.మన ఇల్లు స్వచ్ఛంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందదని,మన గ్రామం స్వచ్ఛంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని,మన జిల్లా స్వచ్ఛంగా ఉంటే ఆరోగ్య ఆంధ్ర లక్ష్యం నెరవేరు తుందని పేర్కొన్నారు.స్వచ్ఛతే దైవత్వానికి ప్రతి రూపమన్న మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా నేను.. నా పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయిస్తానని, నా తోటివారికి కూడా స్వచ్ఛతపై అవగాహన కల్పించే దిశగా ప్రయత్నిస్తానని, నా రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దేందుకు నా వంతు కృషి చేస్తానంటూ కలెక్టర్ లక్ష్మీశ ప్రతిజ్ఞ చేయించారు.

గర్భిణీ స్త్రీలకు ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాలను సందర్శించిన కలెక్టర్ లక్ష్మీశ: ఐసీడీఎస్ మైలవరం ప్రాజెక్ట్ సిడిపివొ కె.పుష్పలత ఆధ్వర్యంలో జి.కొండూరు, వెలగలేరు సెక్టార్ల సూపర్వైజర్లు డి.జోజి కటాక్షం ఐ.అన్నమ్మ పర్యవేక్షణలో దాతల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాలను సందర్శించిన కలెక్టర్ గర్భిణీ స్త్రీలకు పసుపు కుంకుమతో కూడిన సారె అందజేశారు.

తడి చెత్త- పొడి చెత్తను సేకరిస్తున్న క్లాప్ మిత్రలను ఘనంగా సత్కరించిన కలెక్టర్ : గ్రామంలోని తడి చెత్త- పొడి చెత్తను సేకరిస్తున్న క్లాప్ మిత్రల(గ్రీన్ అంబాసిడర్ల) సేవలను గుర్తుచేసుకుంటూ వారిని కలెక్టర్ లక్ష్మీశ ఘనంగా సత్కరించారు.అలాగే తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి ఇస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న గృహిణులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు: సభ వేదిక ముందు విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.నాట్యంలో తమ హావ భావాలను చక్కగా ప్రదర్శించిన చిన్నారులను కలెక్టర్ అభినందించారు.అనంతరం కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో డీపీవో టి.సీతామహాలక్ష్మి, జి.కొండూరు మండల పరిషత్ అధ్యక్షులు వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, జి.కొండూరు ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, జి.కొండూరు తహశీల్దార్ డి.రిబ్కా రాణి,డిఎల్ పిఓ రాఘవన్, డి ఎల్ డి వొ, డిప్యూటీ ఎంపీడీవో కృప కుమార్, ఏపిఎం వెలుగు, ఏపీవో, మండల వ్యవసాయ ధికారి కె సి హెచ్.సూరి బాబు, పి ఆర్ ఏ ఈ సాంబశివరావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ నవీన్ కుమార్, ఎంఈఓ-2 వీరాస్వామి, ఐసీడీఎస్ మైలవరం ప్రాజెక్ట్ సిడిపివొ కె.పుష్పలత ఆధ్వర్యంలో జి.కొండూరు, వెలగలేరు సెక్టార్ల సూపర్వైజర్లు డి.జోజి కటాక్షం ఐ.అన్నమ్మ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వి.మణిందర్ సింగ్, డిప్యూటీ ఎంపీడీవో (జి ఎస్ డబ్ల్యూ ఎస్) ఎం. స్వరూప రాణి,మండల వైద్యాధికారి,మండల విద్యాశాఖ అధికారి మరియు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారులు, స్వర్ణ గ్రామముల సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక బృంద సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తిని పెంపొందించడమే లక్ష్యం

కాకినాడ,ఆగష్టు 22 (వార్తాప్రభ) : విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, పరిశోధనా దృక్పథం, విశ్లేషణా సామర్థ్యం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో వారాధి ఇండియా ఫౌండేషన్ వార్షిక విద్యార్థుల పోటీలు--2026లో భాగంగా జిల్లా స్థాయి డిబేట్, వ్యాసరచన పోటీలు శనివారం కాకినాడలోని పి.ఆర్. ప్రభుత్వ పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి 156 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు సమకాలీన సామాజిక అంశాలపై తమ ఆలోచనలను స్పష్టంగా, తార్కికంగా వ్యక్తీకరించడంతో పోటీలు ఆసక్తికరంగా సాగాయి.ఈ సందర్భంగా అకడమిక్ మానిటరింగ్ అధికారి వి.జగన్మోహన్ మాట్లాడుతూ, విద్యార్థులలో పాఠ్యపుస్తక పరిజ్ఞానంతో పాటు సమాజంపై అవగాహన, ప్రశ్నించే తత్వం, తార్కిక ఆలోచన, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విజయం ఒక్కటే లక్ష్యంగా కాకుండా, పోటీల ద్వారా నేర్చుకోవడం, ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం, ఆధారాలతో తమ అభిప్రాయాలను వ్యక్తీకరించడం విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిలోనూ ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. జిల్లా సైన్స్ అధికారి కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వికాసానికి సైన్స్, సాహిత్యం,సామాజిక అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు సమానంగా అవసరమని అన్నారు. డిబేట్ ద్వారా విద్యార్థుల్లో తార్కిక ఆలోచన, ఆధారాలతో వాదించే సామర్థ్యం, వినే గుణం,ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, వ్యాసరచన ద్వారా సృజనాత్మకత, పరిశోధన, విశ్లేషణ, స్వతంత్ర ఆలోచనా విధానం అభివృద్ధి చెందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎం. సుదర్శన బాబు, వల్లి, కె.పాల్ రాజు, మార్గదర్శక ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ అడ్మిషన్స్ గత 151 జీవో ప్రకారమే జరపాలి - బి.సి.నేత కేసన శంకరరావు

విజయవాడ, ఆగష్టు 22 (వార్తాప్రభ) : డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మెడికల్ అడ్మిషన్స్ నిర్వహించేందుకు ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 102 జీవో ప్రకారం జరపడం వల్ల రిజర్వేషన్ వర్గాలైన బీసీ,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు నష్టం జరుగుతున్నందున గత 151 జీవో పై జరిగిన అడ్మిషన్స్ పై ఫిర్యాదులేవీ రానందున ఆ జీవో పైనే ఎంబిబిఎస్ సీట్ల కేటాయింపులు జరపాలని, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు." మెడికల్ అడ్మిషన్స్- 102 ప్రభుత్వ జీవో " అనే అంశంపై నేడు విజయవాడ లో జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై ఈరోజు డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ టి. సాయి సుధీర్ గారికి మెమోరాండం సమర్పించినట్లు తెలియజేశారు. ఇంకా వారు ప్రతిభ ఆధారంగా 50 శాతం సీట్లు కేటాయించే జనరల్ కేటగిరీలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన బిసి,ఎస్సీ.ఎస్టీలకు జనరల్ కేటగిరీలో అన్ని రకాల ఆప్షన్స్ తో అన్ని కళాశాలలో సీట్లు పొందేలా అవకాశం ఉన్న పాత 151 జీవో ప్రకారం సీట్ల కేటాయింపులు జరపాలన్నారు.తరువాత రిజర్వ్ డ్ కేటగిరీ వారికి ఆయా కళాశాలలో సీట్లు కేటాయించాల న్నారు. గత151 జీ.వో.లో అందరికీ అన్ని ఆప్షన్స్ ఉండేలా రూపొందించడంతో అత్యంత ప్రతిభ కనబరిచిన రిజర్వేషన్ వర్గాలతో పాటు మిగతా వారందరికీ సమన్యాయం జరిగిందన్నారు. పాత 151 జి.ఓ. అమలు జరిపితే ఏ వర్గాలకు ఏ విధమైన నష్టం జరగదన్నారు. అందుకే ప్రతి విద్యార్థి ఆల్ ఆప్షన్స్ పెట్టే విధానాన్ని కొనసాగించేలా జీ.వో.ఎం.ఎస్ నెం:151 అమలు జరపాలని కోరుతున్నామన్నారు. ప్రతి దశలోనూ ఆప్షన్స్ మార్చుకునే అవకాశం ఉన్నప్పటికీ అంతకంటే అందరు అభ్యర్థులకు ఆల్ ఆప్షన్స్ కోరుకునే విధానం ఉండేలా పాత జీవో ద్వారా సీట్లు భర్తీ జరపాలన్నారు. కాబట్టి గత 151 జీవో ప్రకారం మెడికల్ అడ్మిషన్లు జరపాల్సిందిగా శంకరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. .. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మరియు జిల్లా నాయకులు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు.గుర్రం ద్వారక గారు వాకా వెంకటేశ్వరరావు . మహంతి వాసుదేవరావు. తెన్నేటి ప్రకాష్ పలువురు పాల్గొన్నారు

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188